ప్రజాశక్తి

సోమవారం 31 జులై 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

నత్తనడకన భూముల రీసర్వే

- రెండేళ్లల్లో ఐదు గ్రామాల్లోనే పూర్తి
- 173 గ్రామాల్లో పూర్తి ఎప్పటికీ?

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

భూ సమస్యలు, వివాదాల పరిష్కారం కోసం శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా చేపట్టిన భూముల రీసర్వే జిల్లాలో నత్తనడక సాగుతోంది. 2021 జూన్ 28న జిల్లాలో రీ సర్వే ప్రారంభం అయింది. ఈ సర్వే మూడేళ్లలో పూర్తవుతుందని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అప్పటి రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన కష్ణదాస్ ప్రకటించారు. సర్వే పూర్తయ్యాక గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పిస్తామన్నారు. తొలుత దుగ్గిరాల మండలం దేవరపల్లి అగ్రహారం నుంచి ఈ సర్వే ప్రారంభించారు. దేవరపల్లి అగ్రహారంతో పాటు మరో ఐదు గ్రామాల్లో ప్రయోగాత్మకంగా సర్వే చేపట్టారు. శాస్త్రీయ పరిజ్ఞానం, భూముల సర్వేపై సమగ్ర అవగాహన ఉన్న సీనియర్ అధికారుల పర్యవేక్షణలో సర్వే ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో రీసర్వే జరుగుతుందని ప్రభుత్వం చెబుతూ వచ్చింది. కానీ క్షేత్రస్థాయిలో సీనియర్ అధికారులు పట్టుమని 10 గ్రామాల్లో కూడా ఇంత వరకు పరిశీలన చేయలేదు. అత్యాధునికమైన సాంకేతిక పరిజ్ఞానం, రోవర్స్‌తో భూముల సర్వే చేపట్టారు. భూ రికార్డుల ప్రక్షాళన, సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో రీసర్వే జరుగుతుందని ప్రకటించినా చాలా చోట్ల హద్దు రాళ్ల సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. అలాగే స్థానిక విఆర్ఓ, సర్వేయర్‌లతోనే ఈ కార్యక్రమాన్ని కొనసాగిసున్నారు. సర్వేలో వినియోగించే గొలుసు, క్రాస్ స్టాఫ్, యారోస్, టేపు, థియోడలైట్, ఎలక్ట్రానిక్ టోటల్ స్టేషన్ (ఇటిఎస్), కంటిన్యూ ఆపరేటింగ్ సిస్టం (కార్స్) పరికరాల వినియోగం పూర్తిగా జరగడంలేదని తెలిసింది. ప్రస్తుతం 173 గ్రామాల్లో భూముల రీ సర్వే జరుగుతోంది. రెండేళ్ల కాలంలో ఐదు గ్రామాల్లోనే ఈ సర్వే పూర్తయింది. జిల్లాలో మొత్తం 223 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వీటిల్లో సిఆర్‌డిఏ పరిధిలోని 24 రెవెన్యూ గ్రామాలు, మంగళగిరి,తాడేపల్లిలో విలీనం అయిన గ్రామాలను మినహాయించి సర్వే చేపట్టారు. జిల్లా పరిధిలో మొత్తం 5.95 లక్షల ఎకరాల భూమిఉంది. రాజధాని ప్రాంతంలోని గ్రామాలతో పాటు మంగళగిరి,తాడేపల్లి కార్పొరేషన్‌లో కలిపిన గ్రామాలను సర్వే నుంచి మినహాయించారు. మిగతా 173 గ్రామాల్లో రీ సర్వే పనులు చేపట్టారు. జిల్లాలో తొలి విడత పత్తిపాడు మండలం కొండజాగర్లమూడి, దుగ్గిరాల మండలం దేవరపల్లి అగ్రహారం, శృంగాపురం, చింతలపూడి, చేబ్రోలు మండలం మీసర గడ్డ అనంతవరం గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. రెండో దశలో 25గ్రామాల్లో డ్రోన్ ఫ్లై సర్వే నిర్వహించారు. 14 గ్రామాల్లో సర్వే నోటిఫికేషన్ జారీచేశారు. ఏడు గ్రామాల్లో పూర్తి చేయగలిగారు. కానీ తుదినివేదికలు రాలేదు. మూడో దశలో 148 గ్రామాల్లో ప్రారంభించగా వేగంగా జరగడం లేదు. సర్వే పూర్తయిన గ్రామాల్లో కూడా ఇప్పటి వరకు రైతులకు పట్టాదారుపాసు పుస్తకాలు అందరికి ఇవ్వకపోవడం వల్ల తప్పు ఒప్పుల అంశం ఇంకా వెలుగులోకి రాలేదు. డ్రోన్ సర్వేలో ప్రతి భూమికి ఫోటోలు తీస్తారు. వీటిల్లో ఉన్న భూమికి ఉన్నట్టుగా హద్దులు కన్పిస్తాయని అధికారులు చెబుతున్నారు. వాటిల్లో తేడాలు ఉంటే ఫిర్యాదులు చేయవచ్చునని అధికారులు అంటున్నారు. డ్రోన్ ఫ్లై సర్వేలో వచ్చిన ఫోటోల ఆధారంగానే హద్దులు నిర్ణయిస్తామని అధికారులు తెలిపారు. అయితే సర్వే జాప్యం జరగడానికి గ్రామాల్లో భూ యజమానులు అందుబాటులో ఉండటం లేదని అధికారులు చెబుతున్నారు. యజమానులు వేర్వేరు ప్రాంతాల్లో ఉండటం వల్ల జాప్యం జరుగుతుందంటున్నారు.కానీ సిబ్బంది తక్కువగా ఉండటం, పరికరాలు అందుబాటులో లేకపోవడం కూడా మరో కారణంగా కన్పిస్తుంది. రెండేళ్లలో ఐదు గ్రామాలు పూర్తి చేస్తే 173 గ్రామాల పూర్తికి ఎన్ని ఏళ్లుపడుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్ రాజనారాయణ, డైరక్టర్లు.

ఘనంగా నిమ్మకాయల ప్రమాణ స్వీకారం

పాల్గొన్న మంత్రులు కారుమూరి, అంబటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు మిర్చి మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా నియమితులైన నిమ్మకాయల రాజనారాయణ, డిప్యూటీ ఛైర్మన్ షేక్ సుభాని మిర్చి యార్డ్ డైరెక్టర్ల ప్రమాణస్వీకారం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. గుంటూరు బృందావన్ గార్డెన్స్ నుంచి చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ ర్యాలీగా యార్డుకు చేరుకున్నారు.అలాగే వైస్ చైర్మన్, డైరక్టర్లు వారి ప్రాంతాల నుంచి ర్యాలీగా వచ్చారు. వివిధ ప్రాంతాల ర్యాలీలు రావడం వల్ల నగరంలోని పలు ప్రాంతాల్లో వాహనాలరాకపోకలకు ఇబ్బందిగా మారింది. తొలుత యార్డు గౌరవ అధ్యక్షులు ఎమ్మెల్యే మద్దాలి గిరిధర రావు చైర్మన్ రాజ్‌నారాయణ, వైస్ చైర్మన్ సుభానీ, డైరక్టర్లు పల్లా శ్రీనివాసరావు, మహ్మద్ ఫరూక్, కోటా గంగాభవానీ, కోలా అన్నపూర్ణ, కొండారెడ్డి నాగలక్ష్మీ, కొప్పుల విజయ మాధవి, పి.సుశీల,షేక్ సలీమ, బి.వెంకటేశ్వరరావు, గుంజర ప్రభుదాసు, ఎం.సతీష్‌కుమార్, గుడివాడ అరుణ, కొత్తపల్లి శివ సాండిరెడ్డి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

2 లో

సాగర్ కుడికాలువకు నీటి నిలిపివేత

ప్రజాశక్తి - విపి సౌత్

కృష్ణానది యాజమాన్య బోర్డు ఈ నెల 20న తాగు నీటి అవసరాల నిమిత్తం 5 టీఎంసీల నీటిని నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాలువకు కేటాయించారు. నీటి విడుదల పూర్తి కావటంతో కుడికాలువకు ఆదివారం అధికారులు నీటిని నిలిపివేశారు. మధ్యాహ్నం కుడి కాలువకు విడుదలవుతున్న 4,848 క్యూసెక్కులను ఒంటి గంట నుంచి గంటకు 1,000క్యూసెక్కుల చొప్పున తగ్గిస్తూ సాయంత్రం 5 గంటలకు పూర్తిస్థాయిలో నీటి విడుదలను నిలిపివేశారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 515. 10 అడుగుల వద్ద ఉండగా ఇది 140.4917 టీఎంసీలకు సమానం.

స్పందించకుంటే సమ్మె తప్పదు

8 లో

వరికపూడిశెల పనులు ప్రారంభించాలి

సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్

ప్రజాశక్తి-వినుకొండ

మాట్లాడుతున్న గుంటూరు విజయకుమార్

వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం పనులు ప్రారంభించాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మూడు మండలాల్లో లక్ష ఎకరాలకు సాగునీరు, వందల గ్రామాలకు తాగునీరు సమస్యను తీర్చే వరికపుడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపనల నిర్ణయాన్ని వెనక్కు తీసుకుని వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. నిర్మాణానికి అన్ని అటవిక అనుమతులు వచ్చాయని చెబుతున్న ప్రభుత్వం నేరుగా పనులు ప్రారంభించాలన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు, వైయస్ రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేశారని, వైయస్సార్ పాలన సాగిస్తున్నామని చెప్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డి తిరిగి శంకుస్థాపన చేయాల్సిన అవసరం లేదని పనులు చేపట్టాలన్నారు. మణిపూర్ ఘటనపై పార్లమెంట్లో జరిగిన అవిశ్వాస తీర్మానానికి అధికార వైసిపి, టిడిపి ఎంపీలు వ్యతిరేకంగా ఓటు వేయడం దుర్మార్గమన్నారు. మానవత్వం ఉన్న వారు ఎవరైనా మణిపూర్ ఘటన ఖండించకుండా ఉండరని, మొండిగా వ్యవహరిస్తున్న వైసిపి ప్రభుత్వ తీరుపై సమగ్ర చర్చ జరగాల్సి

2 లో

పొన్నూరులో భారీ ర్యాలీ

మణిపూర్ ఘటనపై వెల్లువెత్తిన నిరసన

వార్తలు లోపలిపేజీల్లో

వరికపుడిశెల పనులు ప్రారంభించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉందన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, పేదలు వాగులు చెరువు పోరంబోకు భూములను కొంత ఆక్రమించుకొని సాగు చేసుకుంటుంటే కొందరు దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారని అటువంటి ఘటనపై చర్యలు తీసుకోవాలన్నారు. వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రభుత్వ భూముల ఆక్రమణదారులను ప్రోత్సహించరాదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సిపిఎం పోరాడుతుందని తెలిపారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు ఏపూరి గోపాలరావు, సిపిఎం పట్టణ పార్టీ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు తిరుమల లక్ష్మి, నవీన్, రంజాన్ బి, నాసర్ బి తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై పరస్పర కేసులు నమోదు

ప్రజాశక్తి- తెనాలి

భార్యాభర్తలకు సర్ది చెప్పేందుకు వచ్చిన బంధువులు పరస్పరం కొట్లాడుకున్న ఘటనపై పోలీసులు కేసులు నమోదు చేశారు. పట్టణ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నరావుకు చెందిన దంపతులు మంచాలు రాజేష్, జ్యోతి మధ్య విభేదాలున్నాయి.. ఇరువురు ఘర్షణ పడుతుండటంతో వారికి సర్ది చెప్పేందుకు ఇరువర్గాల బంధువులు అక్కడికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల బంధువుల మధ్య వాదోపవాదాలు పరస్పరం దాడికి దారి తీసింది. ఘటనపై ఇరువర్గాలు పోలీసులను ఆశ్రయించడంతో ఆదివారం పరస్పర కేసులు నమోదు చేశారు.

సాగరమాత ఆలయంలో భక్తుల ప్రార్ధనలు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

విజయపురిసౌత్ లోని సాగరమాత ఆలయంలో ఆదివారం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ మాట్లాడారు. అనంతరం దివ్యబలి పూజ కార్యక్రమం నిర్వహించారు. తేరు ప్రదక్షిణ జరిగింది.

ఈ యన్‌టి వార్డులో కోవిడ్ టెస్టులు ఉండవు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి ఈయన్‌టి విభాగం లో ఇక కోవిడ్ టెస్టు లు ఉండవని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ స్పష్టం చేశారు. ఆపరేషన్‌ల కోసం అవసరమైన మందుల కోసం బయట కొనాల్సిన అవసరం లేదని ఆయన సూచించారు. శనివారం ఈయన్ టి విభాగాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్బంగా ఆయన మీడియా తో మాట్లాడుతూ ఈ యన్ టి విభాగం లో ఆపరేషన్ ల కోసం కోవిడ్ పరీక్షలు చేయాలనీ, మందుల కోసం బయట కొనుగోలు చేయమని రోగులకు చెబుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని ఆయన చెప్పారు. ప్రతి ఒక్కరికి కోవిడ్ టెస్టులు చేయించాల్సిన అవసరం లేదన్నారు. కోవిడ్ లక్షణాలు ఉంటే మెడిసిన్ విభాగానికి పంపించాలని ఆయన చెప్పారు. కోవిడ్ లక్షణాలు తగ్గిన తర్వాత ఆపరేషన్‌ల కోసం సిద్ధం చేసుకోవాలని ఆయన తెలిపారు. కోవిడ్ లక్షణాలు తగ్గిన తర్వాత ఆపరేషన్ లు చేయడం మంచిదని ఆయన సూచించారు. అదేవిధంగా మందులకు ఎటువంటి పరిస్థితి లోను బయట పంపించేందుకు ప్రోత్సహించవద్దని ఆయన అన్నారు. మందుల స్టోర్ లో ఉన్న మందులను వాడటం మంచిదని తెలిపారు. బయట మందులు రాయవద్దని ఆయన సూచించారు. రక్త పరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్ లకు పంపించవద్దని, ఆసుపత్రిలో 24 గంటల ల్యాబ్ అందుబాటులో ఉంటే బయటకు పంపించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. ఆసుపత్రి సిబ్బంది రోగుల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నట్లు దృష్టి కి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సూపరింటెండెంట్ వెంట సివిల్ సర్జన్ ఆర్ యం ఒ డాక్టర్ సతీష్ కుమార్. నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని ఉన్నారు.

ఘనంగా నిమ్మకాయల ప్రమాణ స్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ సిఎం జగన్ అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గత నాలుగేళ్లలో అన్ని పదవుల్లో బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలకు పెద్ద పీట వేశారన్నారు. గుంటూరు మిర్చి యార్డ్ ఛైర్మన్ పదవి మంత్రి పదవి కంటే పెద్దదని తాను భావిస్తున్నట్లు తెలిపారు. గడప దాటకుండా అవ్వ, తాతలకు సంక్షేమ ఫలాలను వాలంటీర్ల ద్వారా అందిస్తున్నారన్నారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లుడుతూ మిర్చి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గా ఇచ్చిన బాధ్యతను నిమ్మకాయల రాజనారాయణ సమర్ధవంతంగా నిర్వర్తించాలని కోరారు. ఇదొక మంచి అవకాశం అన్నారు. ఎంపి లావు శ్రీకష్ణ దేవరాయులు మాట్లాడుతూ నిమ్మకాయల రాజనారాయణ మార్కెట్ యార్డ్ ను మరింత ముందుకు తీసుకువెళ్తారని ఆశిస్తున్నామన్నారు. మిర్చి యార్డ్ లో అనేక వసతులు ఏర్పాటు చేశారని ఒక డ్రైయింగ్ ఫెసిలిటీ ఏర్పాటు చేస్తే మరింత బాగుంటుందని తెలిపారు. జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టిన మాట్లాడుతూ మిర్చి మార్కెట్ యార్డ్ మరింత మెరుగ్గా పని చేసేందుకు కషి చేయాలన్నారు. శాసన మండలి సభ్యులు చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ తాను గుంటూరు మిర్చి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గా 3 సంవత్సరాల 3 నెలలు సేవలు అందించానని తెలిపారు. మార్కెట్ యార్డ్ లో అనేక మౌలిక వసతుల ఏర్పాటుకు కషి చేశామన్నారు. శాసన మండలి సభ్యులు మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రపంచ గుర్తింపు వున్న మిర్చి మార్కెట్ యార్డ్ కు బిసి కులానికి చెందిన నిమ్మకాయల రాజనారాయణ కు ఇవ్వడం సంతోషకరమన్నారు. మాజీ మంత్రి డొక్కా

మాణిఖ్య వరప్రసాద్ మాట్లాడుతూ మిర్చి మార్కెట్ యార్డ్ రైతులకు అన్నీ విధాలుగా ఉపయోపడేలా తీర్చిదిద్దాలన్నారు. నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ అభివద్ధికి మరింతగా కషి చేస్తానని తెలిపారు. సభలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, శాసన మండలి సభ్యులు జంగా కష్ణమూర్తి, లేళ్ళ అప్పిరెడ్డి, కల్పలత రెడ్డి ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా, మార్కెటింగ్ మరియు సహకార శాఖ ప్రభుత్వ సలహాదారులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ బాల వజ్రబాబు, రాష్ట్ర మార్కెటింగ్ శాఖ జేడి శ్రీనివాసరావు, మార్కెటింగ్ శాఖ ఆసిస్టెంట్ డైరెక్టర్ రాజ బాబు, మిర్చి మార్కెట్ యార్డ్ సెక్రటరీ వేంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో సమూలా మార్పులు!

నెల రోజుల్లో పలు సంస్కరణలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రోగులను స్వయంగా పరీక్షిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి లో నెల రోజుల వ్యవధి లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. గతంలో పనిచేసిన సూపరింటెండెంట్‌లు కేవలం పరిపాలన పరమైన అంశాలు, విఐపిల రాకపోకలపైనే దృష్టి సారించే వారన్న విమర్శ ఉంది. జూన్ 30న బాధ్యతలు స్వీకరించిన సూపరింటెండెంట్ డాక్టర కిరణ్‌కుమార్ తనదైన శైలిలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. శెలవు రోజుల్లో కూడా ఆస్పత్రికి వచ్చి వివిధ విభాగాల్లో ఆకస్మిక తనిఖీలను నిర్వహిస్తున్నారు. పనిచేయని వైద్యులను పనిచేయించడం, సిబ్బందిని కళ్లతోనే భయపెట్టి బాధ్యతలను గుర్తుచేస్తున్నారు. జిజిహెచ్ లో అదనంగా మందుల పంపిణి కౌంటర్ ప్రారంభంకు చర్యలు చేపట్టారు. అంతకు ముందు కేవలం మూడు కౌంటర్లు మాత్రమే ఉన్నాయి. పేషంట్లు ఎక్కువ మంది వస్తుండటం తో నాలుగో కౌంటర్ ను ప్రారంభించారు. జనరల్ మెడిసిన్ విభాగం లో స్ట్రెచర్ పై రోగులు ఉండటాన్ని గమనించి 50 పడకలను అందుబాటులో తెచ్చారు. గతంలో మంజూరు చేసి ఖాళీగానున్న 200 పోస్టుల భర్తీ కోసం ప్రతిపాదనలు పంపించారు. ప్రతి నుంచి సానుకూలత వచ్చింది. ఆసుపత్రి లో అవయవ మార్పిడి ఆపరేషన్ లు రెగ్యులర్ గా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రసూతి, స్త్రీ వ్యాధుల చికిత్స విభాగం ఆధునీకరించేందుకు రూ. 70 లక్షలు మంజూరు. భారతీయ పరిశ్రమల సమాఖ్య ముందుకు వచ్చి ప్రభుత్వం తో ఒప్పందం కుదిరింది. దీనివల్ల గర్భిణులకు మెరుగైన సేవలు అందుతాయి. పొదిల ప్రసాద్ భవనం లో ఉన్న మందుల పంపిణి కేంద్రాన్ని తిరిగి ప్రారంభించారు. మందుల కోసం పాత ఆసుపత్రి కి వెళ్లడం కష్టంగా మారడటం తో తిరిగి మందుల కౌంటర్ ప్రారంభించారు. అత్యవసర రోగులకు అందుబాటులో ఉండేందుకు క్యాజువాల్టి లో రెండో సూపరింటెండెంట్ కార్యాలయం ను ఏర్పాటు చేశారు. ఒ పి లో చికిత్స కోసం వచ్చిన రోగులకు మూత్రశాల లేకపోవ డాన్ని గుర్తించారు. వెంటనే రోగులకు అందుబాటులో తెచ్చి కష్టాలు తీర్చారు.అత్యవసర చికిత్స లు జరుగుతున్న సమయం లో ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్ లు లేకపోవడం గుర్తించారు. సి టి వి ఎస్ విభాగం వైద్యులు అందుబాటులో లేకపోవడం ను డి యం ఈ దష్టికి తీసుకుని వచ్చారు. ఒకరికి బదిలీ చేయగా మరో ఇద్దరికి మెమో లు జారీ చేశారు. దాంతో వైద్యులు అప్రమత్తం అయ్యారు. ఉదయం 8.30 గంటలకు డ్యూటీ కి రావడం కనిపిస్తోంది.కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ ల కోసం 20 లక్షల తో పరికరాన్ని కొనుగోలు చేశారు. ఒ పి లో పని వేళలను మార్పులు తీసుకుని వచ్చారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఒ పి రిజిస్ట్రేషన్ కేంద్రాలను రోగులకు అందుబాటులో తెచ్చారు. వైద్యులకు సకాలంలో భోజనం అందించాలని క్యారాజ్ లను ఏర్పాటు చేశారు. ఓపి కేంద్రాల వద్ద రోజుకు రెండు వేల నుంచి మూడు వేలకు వస్తున్నారు. దాంతో ఒ పి వద్ద రోగుల తాకిడి పెరిగింది.మరో పది ఒ పి కేంద్రాల నిర్మాణం చేపట్టారు. ఆపరేషన్ దియేటర్లను ఆధునికరిస్తున్నారు. మూడో ఆపరేషన్ దియేటర్ ను గ్యాస్ట్రో ఏంట్రాలజీ విభాగానికి ఇవ్వాలని నిర్ణయించారు. క్యాజువాల్టి లో గత 50 సంవత్సరాలనుండి చిన్న ఆపరేషన్ గది ఉండేది. ప్రస్తుతం మూడు థియేటర్లును సిద్ధం చేశారు. జాతీయ స్థాయి లో జిజిహెచ్ కు ఇటీవల రెండో స్థానం దక్కింది. ప్రజల ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేయడం లో ఇండియా లో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి కి రెండో స్థానం దక్కింది. అక్రమ వ్యాపారస్థులపై కోరడ ఝులిపించారు. అధిక ధరలకు అమ్ముతున్న వ్యాపారస్థులకు క్లాస్ తీసుకున్నారు. పరిసరాల పరిశుభ్రత కు ప్రాధాన్యత కల్పించారు. ఆరోగ్య మిత్రల సంఖ్యను పెంచాలని ప్రతిపాదించారు. క్యాజువాల్టి లో 24 గంటల వైద్య సేవలు.. షిఫ్ట్ ల వారీగా ఆర్ యం ఒ ల నియామాకం..అదేవిధంగా గ్రేడ్ -2 నర్సింగ్ సూపరింటెండెంట్ లను కూడా 24 గంటలు ఉండేలా నియమించారు. రాత్రి పూట మహా ప్రస్థానం వాహనాలను అందుబాటులో అందుబాటులోకి తెచ్చారు.మృత దేహాలను ఉచితంగా రవాణా చేసేందుకు చర్యలు చేపట్టారు.

ఉత్సాహభరితంగా జిల్లాస్థాయి చెస్ పోటీలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోరంకిలోని గ్రీన్ స్కూల్‌లో ఆదివారం నాడు జిల్లా స్థాయి చెస్ పోటీలు ఉత్సాహ భరితంగా జరిగా యని కృష్ణాజిల్లా చెస్ అసోసి యేషన్ సెక్రటరీ యన్.యం. ఫణి కుమార్ తెలి పారు. ఈటోర్న మెంట్‌లో బాలుర విభాగంలో 34 మంది, బాలికల విభాగంలో 19 మంది పాల్గొన్నారని తెలిపారు. మొత్తం ఐదు రౌండ్లుగా పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఈపోటీలలో మొదటి నాలుగు స్థానాలు సాధించిన బాల, బాలికల క్రీడాకారులను ఆగస్టు 24 నుండి 27వ తేదీ వరకు అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు కృష్ణాజిల్లా జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు. బాలుర విభాగంలో బి.నాగ చైతన్య, కె.సందీప్, టి.జివితేష్, ఎం.ఆదిత్య ఎంపికవ్వగా, బాలికల విభాగంలో ఆర్.శివ శరణ్య, యస్.జాయ్, వై.శరణ్య, వై.గుణశ్రీ ఎంపికయ్యారని తెలిపారు. ఈసందర్భంగా విజయం సాధించిన క్రీడాకారులను గన్నవరం చెస్ అసోసియేషన్ మేనేజర్ జి.రామకృష్ణ, యస్.ఆర్. కోచింగ్ సెంటర్ అధ్యక్షులు జో.సౌజన్య, డక్టార్ నాగిని, డాక్టర్ రమ్య పాల్గొని విజేతలకు బహుమతులను అందచేశారు.

4 నుండి హైలైఫ్ బ్రైడ్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వివాహ ఫ్యాషన్ అవసరాల కోసం మహిళలకు ప్రత్యేకంగా డిజైనర్ చీరలను అందించేం దుకుగాను హై లైఫ్ బ్రైడ్స్ పేరుతో నగరం లోని హెూటల్ నోవాటె ల్‌లో ఆగస్టు 4 నుండి మూడు రోజుల పాటు ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు డొమినిక్ రాజ్ తెలిపారు. నగరంలోని హెూటల్ నోవాటెల్‌లో ఆదివారం ప్రముఖ మోడళ్లచే ఎగ్జిబిషన్ కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సినీ నటులు, మోడల్స్ డిజైనర్ చీరలను ధరించి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 4, 5, 6 తేదీలలో నోవాటెల్‌లో ఉదయం 10 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు డిజైనర్ చీరల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో అత్యున్నత ఫ్యాషనబుల్, డిజైనర్ చీరలు, బ్రైడల్ ఆభరణాలు, అప్పెరల్, యాక్ససరీలు, మరెన్నో అందుబాటులో ఉంటాయని తెలపిఆరు. లైఫ్ స్టైల్ ఉత్పత్తులు కూడా ఉంటాయని ముఖ్యంగా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా సంగీత సభలు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : శాస్త్రీయ సంగీత పరిరక్షణకు, వ్యాప్తికి ఆవిర్భవించిన శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఇటీవల నిర్వహించిన సంగీత పోటీలలో విజేతలచే ఆదివారం ఉదయం శ్రీ శివరామకష్ణక్షేత్రం, స్టార్ హాస్పిటల్స్ సౌజ న్యంతో స్వరలయ సౌరభం పేరిట నిర్వహించిన సంగీత సభలు స్వరాల జల్లులు వర్షిస్తూ పరిమళింప చేశాయి. శాస్త్రీయ సంగీత పోటీలు నిర్వహిస్తూ విజేతలకు వేదికలు కల్పించి సంగీతంపై వారిలో ఉన్న భక్తిని, అనురక్తిని పెంచుతూ నెలవారీ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమితి కార్యదర్శి సివి.రావు, విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ ఎంసి.దాస్, సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి సంగీత సభలను ప్రారంభించారు. విజేతలు వారి కషిని ప్రకటిస్తూ ప్రదర్శనలలో పాల్గొన్నారు.

అభద్రతలో అన్నదాతలు

- ఖరీఫ్ ప్రారంభంలోనే ప్రతికూల పరిస్థితులు
- భారీ వర్షాలకు దెబ్బతిన్న వెదవరి సాగు

ప్రజాశక్తి-తెనాలి

భారీ వర్షాలు రైతులను అభద్రతా భావానికి గురిచేస్తున్నాయి. ఖరీఫ్ ప్రారంభంలోనే ఎదురైన ప్రతికూల పరిస్థితులపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి కష్టాలను అధిగమించేందుకు దాదాపు రైతులంతా ఆచరిస్తున్న వరి సాగులో వెద పద్ధతి ఈ ఏడాది వారిని తీవ్రమైన ఇబ్బదులకు గురిచేసింది. జిల్లాలో వెద పద్ధతిలో వరిసాగు, ఖరీఫ్‌లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులిలా ఉన్నాయి.

కృష్ణా వెస్ట్రన్ డెల్టా పరిధిలో దాదాపు 5.71 లక్షల ఎకరాలు సాగు భూమి ఉంది. దీనిలో ఖరీఫ్‌లో రైతులు అధికశాతం వరి సాగు చేస్తారు. కృష్ణా వెస్ట్రన్ డెల్టా మూడు జిల్లాల్లో విస్తరించిన నేపథ్యంలో, గుంటూరు జిల్లా వరకూ పరిశీలిస్తే దాదాపు 1లక్షా,65వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగుకు రైతులు సిద్ధ మయ్యారు. బారీ వర్షాలకు ముందే వెద పద్ధతిలో 30వేల ఎకరాల్లో సాగు చేపట్టారు. తెనాలి డివిజన్‌లో 60వేల వరి సాగు భూమిలో కేవలం మూడు వేల ఎకరాల్లోనే వెద పద్ధతిలో సాగు ప్రారంభించారు. జూలై ప్రారంభంలో కురిసిన భారీ వర్షాలకు వెదపెట్టిన వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. వర్షాలకు కొంత మేర దెబ్బతిన్న పొలాల్లో రైతులు వర్షాలు ఆగిన తరువాత తిరిగి దుక్కి దున్ని వెద పెట్టుకున్నారు. మరలా ఈనెల 20 నుంచి ప్రారంభమైన ఎడతెరిపి లేని భారీ వర్షాలతో తిరిగి పొలాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. జల ప్రళయం లాగా వచ్చిన వర్షాలకు రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఖరీఫ్ ప్రారంభంలోనే ఎదురైన ప్రతికూల పరిస్థితులపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి సాగుకు వెద పెట్టి ఎకరాకు దాదాపు రూ.8 నుంచి రూ.10వేల వరకూ పెట్టుబడులు

కరెవరంలో ముంపు నుంచి బయటపడుతున్న పొలాలు

నేలపాడు రోడ్డులో ఇంకా వీడని ముంపు

పెట్టినట్లు రైతులు, కౌలు రైతులు వాపోతున్నారు. భారీ వర్షాలకు పొలాల్లో నీరు బయటకు పోక కొన్ని చోట్ల రైతులు ఇప్పటికీ అష్టకష్టాలు పడుతుంటే, ఇప్పుడిప్పుడే వర్షపు నీటి నుంచి కొన్ని చోట్ల పొలాలు బయటపడుతున్నాయి.

దాదాపుగా వెద పెట్టిన వరి పూర్తిగా దెబ్బతిందని కొందరు రైతులు చెబుతుంటే, అక్కడక్కడ కాలువలు పారుదల ఉండి, నీటి ప్రభావం తక్కువ ఉన్న కొద్ది చోట్ల మాత్రం రైతులకు కొంత ఊరట లభిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు ఇటీవల తెనాలి ఏడిఏ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా కొందరు రైతులతో మాట్లాడారు. పంట నష్టం తదితర వివరాలను తెలుసుకున్నారు. అధికారుల ముందు కూడా రైతులు వారి ఆవేదనను వ్యక్తం చేశారు. అలాగే ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో వర్షాలకు దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు. వర్షాల కారణంగా పొలాలు ముంపుకు గురై నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, ఎకరానికి రూ.10వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే.

ఆగస్టు వరకూ వెద పెట్టుకోవచ్చు : డిఎఒ

జిల్లాలో 1,65వేల ఎకరాల సాగులో 30వేల ఎకరాలు వెదసాగు చేపట్టారు. వర్షాలకు పొలాలు ముంపునకు గురయ్యాయి. మొలకెత్తిన వరి రెండాకుల దశలో ఉంటే ఈ వర్షంతో నష్టం లేదు. వర్షాలు పడే సమయానికి ఒకటి రెండు రోజుల ముందే వెద పెట్టిన పొలాలకు మాత్రమే దెబ్బతింటాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాలో కేవలం మూడు, నాలుగు వందల ఎకరాల్లో మాత్రమే వరి దెబ్బతింది. అయితే ఆగస్టు నెల వరకు వెద పెట్టుకోవచ్చు.

హైటెన్షన్ వైరు తగిలి వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్నంలో అంబేద్కర్ కూడలి వద్ద రెండవ అంతస్తులో నివశిస్తున్న కర్నాటక రాష్ట్రానికి చెందిన ఆనంద్ నివశిసున్నాడు. ఆదివారం ఇంటి ముందు ఉన్న ఫ్లెక్సీబోర్డును సరిచేసే క్రమంలో ఇంటిముందున్న హైటెన్షన్ వైరు తగిలింది. దీంతో ఆనంద్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. 108లో బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఆనంద్ అంబేద్కర్ కూడలి వద్ద టి దుకాణం నిర్వహిస్తాడని స్థానికులు తెలిపారు.

మంగళగిరిలో హైటెన్షన్ వైర్లకు

కానరాని సేఫ్టీ

నివాసాల మద్య ఉన్న హైటెన్షన్ వైర్లకు ప్లాస్టిక్ తొడుగులను విద్యుత్ శాఖ ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హైటెన్షన్ వైర్లకు ఎటువంటి సురక్షత కానరావడం లేదు.. దీంతో ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. హైటెన్షన్ వైరుకు సేఫ్టీ ప్రికాషన్ ఉండిఉంటే ప్రమాదం తప్పి ఉండేది. ఇప్పటికైనా అధికారులు కార్పోరేషన్ పరిధిలో నివాసాలకు దగ్గరగా ఉన్న హైటెన్షన్ వైర్లకు తొడుగులను ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలను అరికట్టవచ్చు.

ఏడుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని బోడేశంభునివారి పాలెం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో స్థానిక ఎస్ఐ షేక్ మహమ్మద్ ఫిరోజ్ సిబ్బందితో ఆదివారం పేకాట స్థావరంపై దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ. 6900లు స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాడతాం

- అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి దీప్తి మనోజ

ప్రజాశక్తి-గుంటూరు

అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ కంటే అదనంగా జీతాలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాల, హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యం నివారించాలని, పని భారం తగ్గించాలని తదితర సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దీప్తిమనోజ అన్నారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో ఎన్.రమాసుష్మ అధ్యక్షతన జరిగిన యూనియన్ జిల్లా సమావేశంలో ఆమె ప్రసంగించారు. ఇటీవల రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో 36 గంటల నిరసన కార్యక్రమం అత్యంత జయప్రదంగా జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. పోరాట కొనసాగింపులో భాగంగా ఆగస్టు 7న జగనన్నకు చెబుదాం పేరుతో 1902 నెంబర్‌కు అంగన్వాడీలంతా ఫోన్ చేసి తమ సమస్యలు విన్నవించాలని, ఆగస్టు 12, 13వ తేదీల్లో ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు.సమావేశంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజీ, జిల్లా నాయకులు ధనలక్ష్మి, ఏవీఎన్ కుమారి, పద్మ, సుకన్య, కిరణ్మయి ప్రసంగించారు.

మాట్లాడుతున్న దీప్తి మనోజ

కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

రౌడీ షీటర్లకు ఎస్ఐ కౌన్సిలింగ్

ప్రజాశక్తి- తెనాలి

రౌడీ షీటర్లు, వారి కదలికలపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందని ఎస్సై సిహెచ్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు స్టేషన్ ఆవరణలో ఆదివారం ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. వారి వారి నివాస ప్రాంతాల మార్పులు చేర్పులు వంటి వివరాలను వారి ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, వాటిని ప్రోత్సహించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలనూ ఉపేక్షించేది లేదని అన్నారు. స్టేషన్ నుంచి ఎప్పుడు పిలిచినా వెంటనే స్పందించాలని చెప్పారు. నేర ప్రవత్తిని తగ్గించుకొని, సత్ప్రవర్తనతో మెలగాలని వారికి హితవు పలికారు.

సాహితీరెడ్డి ట్రస్టు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-గుంటూరు

తమ ఏకైక కుమార్తె సాహితీరెడ్డి ఆకస్మిక మరణం దిగమింగుకొని, ఆమె పేరుతో ట్రస్టు ఏర్పాటు చేసి, లక్షలాది రూపాయలు విద్య, సామాజిక, ధార్మిక సేవలకు భూరీ విరాళాలు అందజేస్తున్న అశోక్‌రెడ్డి, సుధావాణి దంపతుల సేవలు అభినందనీయమని జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా అన్నారు. ఆదివారం గుంటూరు రూరల్ మండలం, జొన్నలగడ్డ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో బండి సాహితీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాహితీరెడ్డి 34వ జయంతిని పురస్కరించుకొని 100 మంది పేద విద్యార్థినులకు రూ.5వేలు చొప్పున రూ.5 లక్షలు ఉపకార వేతనం అందజేశారు. క్రిస్టినా మాట్లాడుతూ విద్యార్థి దశలో మహమ్మారిగా దాపురించిన మొబైల్, సామాజిక మాధ్యమాల రుగ్మతలకు దూరంగా ఉంటూ, తాము ఎంచుకున్న లక్ష్యాలకు చేరువు కావాలని ఉద్బోధించారు. ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి మాట్లాడుతూ ట్రస్ట్ సేవలను కొనియాడారు. జెడ్పీటిసి తుమ్మల సుబ్బారావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మచిలీపట్నం పోర్ట్ ట్రస్ట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్, వ్యాపారవేత్త బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, రెడ్డి బాలుర వసతిగహం అధ్యక్షులు చల్లా అంజిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, జొన్నలగడ్డ సర్పంచ్ ఎం.శిరీష, పాఠశాల హెచ్ఎం జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు అందచేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, తదితరులు

నాగార్జున కొండలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు నాగసిరి, శాంతి సిరి లాంచీలలో కొండకు వెళ్లిన పర్యాట కులు అక్కడ మ్యూజియంలో ఉన్న బుద్ధుని ప్రతిమలు, రాతిపనిముట్లు, మట్టి కుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం, అశ్వమేధశాల, స్నానాల గట్టు చూసి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం అనుపు లోని యాంపి స్టేడియం, అశ్వమేధ యగ్నశాల, 60 అడుగుల ఎత్తునుండి జాలువారే ఎత్తిపోతల జల పాతాన్ని తిలకించారు. లాంచీల ద్వారా పర్యాటక శాఖకు రూ.35 వేల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

చల్లగుండ్లలో కార్డన్ సెర్చ్

24 ద్విచక్రవాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-నకరికల్లు : మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సత్తెనపల్లి డిఎస్పి బి.ఆదినారాయణ ఆధ్వర్యంలో ముగ్గురు సిఐలు, 10 మంది ఎస్ఐలు, 30 మంది కానిస్టేబుళ్ల ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలోని అనుమానిత ఏరియాలలోని గృహాలలో విస్తృత తనిఖీలు చేపట్టి అనుమతి పత్రాలు లేని సుమారు 24 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని నకరికల్లు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి ఆదినారాయణ మాట్లాడుతూ పల్నాడు జిల్లా ఎస్పీ శివశంకర్ రెడ్డి ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాల పత్రాలు చూపించి తీసుకువెళ్లాలని సూచిం చారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా మంచి మార్గం వైపు వెళ్లాలని ఈ సందర్భంగా తెలిపారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

మహిళలకు త్వరితగతిన న్యాయం జరగడం లేదు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

సమాజంలో మహిళలకు జరుగుతున్న అన్యాయంపై వారికి త్వరితగతిన న్యాయం జరగడం లేదని మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు జి. ఉమాశ్రీ అన్నారు. స్థానిక పండరీపురంలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగిన మహిళ సంఘ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ నిర్భయ్ చట్టంలో కూడా న్యాయం జరగడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో పి.భారతి, హిమజ, అన్నమాయమ్మ, ఏసమ్మ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏడో తారీఖున పోరుయాత్ర బస్సు హిందూపూర్ నుంచి చిలకలూరిపేట రానున్న సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పోలీస్ వారి హెచ్చరిక

రంగు రాళ్ళు గురించి మరియు గుప్త నిధుల గురించి పురాతన దేవాలయాలు మరియు నేల, పొలాలు లో గుంతలు త్రవ్వడం చట్ట పరంగా నేరం అట్టి నేరములకు పాల్పడిన యెడల వారి పై చట్ట పరమైన చర్యలు తీసుకోనబడును.

రంగురాళ్లు, గుప్త నిధుల కోసం తవ్వొద్దు

ప్రజాశక్తి-బెల్లంకొండ

మండలం లోని పలు గ్రామాల్లో రంగు రాళ్ల కోసం,గుప్త నిధుల కోసం పురాతన దేవాలయలు, పొలాలు తవ్వడం చట్ట పరంగా నేరమని బెల్లంకొండ ఎస్సై కె.అమీర్ అన్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఎమ్మాజిగుడెం, మన్నేసుల్తన పాలెం, కేతవరం, వెంకటాయపాలెంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

మానవత్వం చాటుకున్న స్నేహితులు

ప్రజాశక్తి-కారెంపూడి

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న స్నేహితుడికి ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.2001-2002 సంవత్సరం బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హై స్కూల్లో పదవ తరగతి చదువుకున్నారు. తన స్నేహితుడు తడిక మళ్ళీ సందీప్ అనారోగ్యానికి గురి కావడంతో స్నేహితులందరూ కలిసి రూ.50 వేలను తెలుగు పండిట్ ఉపాధ్యాయుడు కటకం రంగయ్య ద్వారా అతనికి అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక జడ్పీ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని అతనికి అందజేశారు. అతని స్నేహితులు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్న తన స్నేహితుడిని ఆర్థికంగా ఆదుకోవాలని నిర్ణయించుకొని అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో షేక్ మీరా సాహెబ్, జి.ఏడుకొండలు, బాలు నాయక్,ప్రవీణ్ రెడ్డి, కష్ణంరాజు,మాన్సింగ్ నాయక్, హేమబాల కుమార్,నాగేశ్వరరావు, వీరబాబు,బాజీ తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగ,కార్మికుల

సమస్యలు పరిష్కరించండి

రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

విద్యుత్ ఉద్యోగ,కార్మికుల న్యాయమైన డిమాండ్లను విద్యుత్ యాజమాన్యం మరియు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు జిల్లా నాయకులు ఎం.సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కోటప్పకొండ రోడ్డు లోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు జె. రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు 45 శాతం ఫిట్మెంట్ తో పిఆర్సీ అమలు చేయాలని ,కాంట్రాక్ట్ కార్మికులకు రెగ్యులర్ చేయాలని జేఎల్ఎం గ్రేడ్ 2 ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రొబేషన్ డిక్లరేషన్ చేయాలని ఉద్యోగులకు పాత విధానంలోనే పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగదు రహిత అపరిమిత ఆరోగ్య పాలసీని అమలు చేయాలని చనిపోయిన కార్మికుల కుటుంబాలలో సభ్యునికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబులు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభు త్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమాలు చేసి హక్కులు సాధించుకోవాలని సూచించారు. కార్మికులు చేపట్టే న్యాయ పోరాటాలకు సిఐటియు ఎఐటియుసి మద్దతు ఉంటుందన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ 31న పల్నాడు జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి రాయబారం కార్యక్రమం జరుగుతుందని వచ్చే నెల 2న ఉమ్మడి గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద జరిగే మహాధర్నాలో జిల్లా ఉద్యోగ కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఉప్పలపాటి రంగయ్య , హెచ్- 180 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రాజేంద్ర ప్రసాద్, ఎల్.ఐ యోహాను, గాలిబ్, బి. రాజశేఖర్, మురళి, కరిముల్లా, గిరి,ఉద్యోగ కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసరావు

యడవల్లి దళిత రైతులను బెదిరించడం దుర్మార్గం

సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

యడవల్లి దళిత రైతుల భూములెక్కడికి పోవని, వారికి పట్టాలిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెప్పిన మాటలు, సెంటు భూమి కూడా ఎక్కడికి పోదు 416 ఎకరాలకు పట్టాలిప్పి స్తానని స్థానిక మంత్రి చెప్పిన మాటలు నేటికి నెరవేరలేదని సిఐటియు మండల కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు విమర్శించారు. ఆదివారం దళిత రైతులు వారి వారి పొలాలను దున్ను కునేందుకు శుభ్రం చేసుకుంటుంటే స్థానిక రూరల్ పోలీసులు వారిని ఆపమని చెప్పడం,లేకుంటే కేసులు పెడతామని బెదిరించడం దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు. దళిత రైతులకు మద్దతుగా యడవల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ నష్టపోయిన వారికి నష్టపరిహారమివ్వాలని, 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలని ఆర్.డి.ఓ., కలెక్టర్.,మండల తహశీల్దార్లకు అనేక పర్యాయాలు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని అన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించకపోవ డంతో రైతులు వారి భూములను వాళ్ళు సాగు చేసుకుం టున్నారని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు వారి భూముల్లో వారు సాగు చేసుకుంటారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారికి సముచితమైన న్యాయం చేయాలని అప్పటి వరకు సిఐటియు,కుల వివక్ష పోరాట సమితి, వ్యవసాయ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు వారికి మద్దతుగా ఉంటాయని స్పష్టం చేశారు.

నోటి దగ్గర కూడు పోయింది

వేలి ముద్రలు వేయించుకున్నారని, డబ్బులు కూడా ఇవ్వ లేదని యడవల్లి దళిత రైతు తెల్ల చిన్న మస్తాన్ అన్నారు. రోజు మాదిరిగానే ఆదివారం కూడా పొలం పనులు చేసుకుంటుంటే ఎస్.ఐ., కానిస్టేబుళ్ల వచ్చి మర్యాదగా బయటకు పొండి, లేకపోతే కేసులు పెడతా మని బెదిరించారని కన్నీటిపర్యంతమయ్యారు. తనకున్న ఎకర మున్నర పొలం లో 50 బస్తాలు ధాన్యం పండించే వాడినని, ఆ పొలం నేడు లేకుండా పోయిందని అన్నారు. తాను,తన భార్య పస్తులుండాల్సిన పరిస్థితి అని, తకు న్యాయంగా రావాల్సినవి ఇవ్వాలని, అప్పటి వరకూ తమ పొలాలను తాము సాగు చేసుకుంటామంటామని అన్నారు.

తిండికి ఇబ్బంది పడుతున్నాం

యడవల్లి దళిత రైతు, మాజీ సొసైటీ అధ్యక్షులు వెంకట్రావు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేదని చెప్పారు. భూములను దున్నే కార్య క్రమంలో పిచ్చి చెట్లు, తుమ్మ చెట్లను ఆదివారం నాడు తీసివేస్తున్న సమయంలో పోలీసులు వాటిని కదిలించి వద్దని హెచ్చరించారని, మాట వినకుంటే కేసులు పెడతామన్నారని అన్నారు. తిండికి జరగక ఇబ్బంది పడుతున్న తమను అనేక విధాలుగా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పారు.

శాంతి స్థాపనలో మోడీ ప్రభుత్వం విఫలం

మణిపూర్ ఘటనలపై నిరసనల వెల్లువ

నరసరావుపేటలో..

యడ్లపాడులో..

రెంటచింతలలో..

మాట్లాడుతున్న రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎం.రాధాకృష్ణ

ప్రకాశక్తి-చిలకలూరిపేట

ఆంధ్రప్రదేశ్ లోని మూడు ప్రాంతీయ పార్టీలు డూడూ బసవన్నల వలే వ్యవహరిస్తూ స్వతంత్ర ప్రతి పత్తి ని కోల్పోయాయని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎం రాధాకృష్ణ విమర్శించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతి స్థాపన, లౌకికవాద పరిరక్షణ విషయాల్లో నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు ఇండియా కూటమి ప్రవేశ పెడుతున్న అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా బిజెపి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం ద్వారా లౌకికవాద పార్టీలని చెప్పుకునే అర్హతను కోల్పోయాయని విమర్శించారు. దేశంలో శాంతి స్థాపన కోసం లౌకిక వాద పరిరక్షణ కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని ఇండియా కూటమిని బలపరచాలని విజ్ఞప్తి చేశారు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జాతుల మధ్య వివాదాలు సృష్టించి కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం పైశాచిక ఆనందం పొందుతోందని డిసిసి ప్రెసిడెంట్ అలెగ్జాండర్ సుధాకర్ విమర్శించారు. మణిపూర్ లో జరుగుతున్న బీజేపీ ప్రేరేపిత అల్లర్లకు నిరసన గాడీసీసీ ప్రెసిడెంట్ అలెగ్జాండర్ సుధాకర్ అధ్వర్యంలో ఆదివారం పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అలెగ్జాండర్ సుధాకర్ మాట్లాడుతూ గత 3 నెలలుగా జరుగుతున్న అల్లర్లను అదుపు చేయకుండా మోడీ ప్రభుత్వం చోద్యం చూస్తోందని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపకపోతే దేశ మంతా మణి పూర్‌లా మారుతుందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎస్ ఎం బాషా, సీదాకృష్ణ, రవికిషోర్,దాసరి రాజు, రమేష్,పూర్ణ,జయపాల్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-యడ్లపాడు

క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో యడ్లపాడు లో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ లో జరుగుతున్న దాడులను ఖండించారు. కార్యక్రమంలో యడ్లపాడులోని క్రైస్తవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలో క్రైస్తవులు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం మాచర్ల-గుంటూరు ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. దీంతో రహదారి పై వాహనాలు నిలిచిపోయాయి ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ మణిపూర్‌లో హింసాత్మక ఘటనలకు ఇప్పటివరకు 161 మంది చనిపోయారన్నారు. నిరసనలో ఆర్.ప్రతాప్ బాబు, ఎం.లూద్ రాజు,బి. దేవ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై వెల్లువెత్తిన నిరసన

సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు - పొన్నూరులో కుల, మతాలకతీతంగా భారీర్యాలీ

గుంటూరులో నిరసనలో మాట్లాడుతున్న నళినీకాంత్

పెదకాకాని ర్యాలీలో పాశం రామారావు

తాడేపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీలో వై నేతాజీ తదితరులు

ప్రజాశక్తి - పెదకాకాని

మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, గిరిజన తెగలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. ఆదివారం పెదకాకాని సుందరయ్య కాలనీలో జరిగిన నిరసనలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజి అధ్యక్షత వహించారు. రామారావుమాట్లాడుతు గత మూడు నెలలుగా మణిపూర్ రాష్ట్రంలో రెండు గిరిజన తెగల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయని, మెజార్టీ తెగలకు చెందిన ప్రజలు, మైనార్టీ తెగలుగా ఉన్న కుకీలు, నాగాలపై దాడులు చేస్తు గృహదహనాలకు పాల్పడుతు, గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగిస్తున్నారని, ఇలాంటి ఘటనలను కూడా ప్రధాని మోడీ మణిపాల్ సందర్శించకపోవడం దారుణమన్నారు. మణిపూర్ ముఖ్యమంత్రి అల్లర్లను నివారించే ప్రయత్నాలు చేయకపోగా మెయితీలకు అనుకూలంగా రెచ్చగొట్టే పద్ధతులను అవలంభిస్తున్నారన్నారు. మహిళలపై అత్యాచారాలు చేస్తూ, నగ్నంగా ఊరేగించిన దుర్మార్గులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజి మాట్లాడుతు గిరిజనులపై ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి దాడు లకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి సాంబయ్య, ఎ నాగేశ్వరరావు, ఎస్‌కె మీరావలి, వెంకటరమణ, కె గురవమ్మ, మరియదాసు, కె ప్రేమ్ చంద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు

మణిపూర్‌లో జరిగిన మారణహోమానికి నైతిక బాధ్యత వహిస్తూ మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని, ఈ ఘటనపై భారత ప్రధానమంత్రి మౌనం వహించడం సిగ్గుచేటని వివిధ ప్రజాసంఘాల నాయకులు విమర్శించారు.మణిపూర్ మారణహోమాన్ని నిరసిస్తూ ఆదివారం సిపిఎం, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శంకర్‌విలాస్ సెంటర్ నుండి లాడ్జి సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో ప్రజల మధ్య ఐక్యతను చెడగొట్టేందుకు ఆ రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని విమర్శించారు. గుజరాత్ రాష్ట్రంలో మారణ హోమం సష్టించిన వ్యక్తి దేశ ప్రధానిగా ఉండడాన్ని విమర్శించారు. మణిపూర్ రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడాల్సిన ప్రభుత్వం దీనికి భిన్నంగా అక్కడ జరుగుతున్న మహిళలపై దాడులు అత్యాచారాలు సమాజానికి తెలియకుండా ఉండేందుకు ఇంటర్నెట్ సేవలను రద్దు చేసిందని తెలియజేశారు. ప్రస్తుతం సోషల్ మీడియా ద్వారా మణిపూర్ ఘటనకు సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్న నేపథ్యంలో మణిపూర్ ప్రజానీకానికి దేశ ప్రజానీకం మద్దతు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీలు అధికార పార్టీ బిజెపిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే ఆంధ్ర రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలు రెండు బీజేపీకి మద్దతుగా నిలవడం నయవంచనేనని విమర్శించారు.బిజెపి దేశ ప్రతిష్టను మంటగలిపిందన్నారు. దేశ ప్రజల మధ్య ఐక్యతను కాపాడాలని, మతోన్మాద చర్యలను ఖండించా లన్నారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, ప్రజాసంఘాల నాయకులు వివికె సురేష్, ఎల్.ఎస్.భారవి, అబ్దుల్ సలీం, ఖలీల్, కలామ్, ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు షేక్ బాషాతదితరులు ఉపన్యాసించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.లక్ష్మణరావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.ముత్యాలరావు, కె. శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్. అరుణ, పి.వి.రమణ, కిరణ్, లూదర్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి : మణిపూర్‌లో జరిగిన ఘటనలపై మీరు చర్యలు తీసుకుంటారా, సుమోటాగా స్వీకరించి మమ్మల్ని చర్యలు తీసుకుంటారా అని సుప్రీం కోర్టు హెచ్చరించే దాకా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏం చేస్తున్నట్లు అని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.నేతాజీ ప్రశ్నించారు. మణిపూర్ మారణకాండను నిరసిస్తూ ఆదివారం రాత్రి పట్టణంలోని ప్రకాష్‌నగర్ సెంటర్‌లో వేముల దుర్గారావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సగభాగం జనాభా కూడా లేని ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో తమ స్వార్థ ప్రయోజనాల కోసం తెగల మధ్య చిచ్చు రాజేశారని విమర్శించారు. 54 శాతం మైటీలు, 35 శాతం గిరిజన తెగలైన కుకీలు ఉన్న ఆ రాష్ట్రంలో మెజార్టీ అయిన మైటీలకు కొమ్ముకాసి ఈ దారుణకాండకు బిజెపి బరితెగించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రవాణా సౌకర్యాలు కూడా సరిగ్గా లేని ఆ రాష్ట్రంలో అభివృద్ధి గురించి మాత్రం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతావనిలో సమస్యలు పరిష్కరించడం చేతకాని డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలో ఉండటం సిగ్గు చేటని విమర్శించారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి ఆ పదవులకు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాశ్మీర్ రాష్ట్రంలో 300 ఆర్టికల్‌ను రద్దు చేసిన విధంగానే మణిపూర్‌లో గిరిజనులకు ఉన్న ప్రత్యేక హక్కులను కాలరాసి అక్కడ ఉన్న భూమిని కార్పొరేట్లకు కట్టబెట్టడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక పథకం ప్రకారం మణిపూర్‌లో బిజెపి మారణకాండ సృష్టించిందని తెలిపారు. సరిహద్దు రాష్ట్రమైన మణిపూర్ ఒక్క అస్సాం రైఫిల్స్ దళం తప్ప మిగతా దళాలన్నీ మైటీలకు కొమ్ము కాశాయని ఆందోళన వ్యక్తం చేశారు. మైటీలకు ఏదో అన్యాయం జరిగిందని ఒక అబద్ధపు ప్రచారాన్ని వీడియో రూపంలో విడుదల చేసి ఈ హత్యాకాండకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కారణమయ్యారని విమర్శించారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఇందుకు ఆజ్యం పోశాయని మండిపడ్డారు. ఆస్తులు తగలబెట్టడం దగ్గర నుంచి హత్యలు చేయడం, మహిళలను వివస్త్రలను చేయడం వంటి దారుణ ఘటనలకు అక్కడ పాల్పడ్డారని, దీనికి బిజెపి ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. ప్రజలు ఐక్యమత్యంగా నిలబడి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు ప్రజానాట్య మండలి రాష్ట్ర గాయకులు జగన్ మణిపూర్ ఘటనలపై ఆలపించిన గేయాలు సభికులను కంటతడి పెట్టించాయి. ఈ సభలో సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, కార్యదర్శి వర్గ సభ్యులు కొట్టె కరుణాకరరావు, నులకపేట కార్యదర్శి ఎ.శౌరిబర్తులం, చినదుర్గారావు తదితరులు పాల్గొన్నారు.అనంతరం స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి ప్రకాష్‌నగర్ సెంటర్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో జరిగిన దారుణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆ రాష్ట్ర సిఎం రాజీనామా చేయాలని, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలు నశించాలని నినాదాలు చేశారు.

ప్రజాశక్తి-తాడేపల్లి :మణిపూర్ ఘటనపై మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఆదివారం నిరసన తెలిపారు. తాడేపల్లి పట్టణంలోని కృష్ణనగర్, కృష్ణమందిరం మస్టర్ పాయింట్ల వద్ద కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వై.రాంబాబు, బి.సంతోషం, ఎం.కామాక్షి, కె.నాని, వై.నాని, ఈశ్వరమ్మ, అనిత పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్ :మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న మారణకాండ నిరసనగా ఆదివారం పొన్నూరు పట్టణంలోని అన్ని మతాల ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మర్కస్ మస్జిద్ నుండి బయలుదేరి జి బి సి రోడ్ కాసుకర్రు రోడ్డులో ఉన్న లూథరన్ చర్చి వద్దకు చేరి అక్కడ నుండి అంబేద్కర్ సెంటర్ కు చేరి మణిపూర్ లో సృష్టిస్తున్న మారణకాండ ద్రోహులను వెంటనే శిక్షించాలని నినాదాలు చేశారు. ముస్లిం క్రైస్తవుల మత పెద్దలు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో అల్లర్లకు అక్కడ అధికార బిజెపి పార్టీ రాజకీయ అవకాశవాదమే కారణమని, వీరి అవకాశవాదం వలనే అక్కడ ప్రజలు భారీగా నష్టపోయారని ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారదర్శకంగా చర్యలు తీసుకుని అల్లర్లను అదుపులోకి తీసుకురావాలని అన్నారు. అక్కడ జరిగిన అల్లర్లకు దాదాపు 60 వేల మంది కుకీ లు నిరాశ్రయులయ్యారన్నారు. మణిపూర్ రాష్ట్రానికి 371 వ అధికరణ ప్రకారం అడవుల్లో నివసిస్తున్నటువంటి ఎస్టీలకు సంబంధించి కుకీలకు ప్రత్యేక చట్టాల ద్వారా రక్షణ కల్పించడం జరుగుతుందని, అడవుల్లోని ఖనిజ సంపదను కొల్లగొట్టి కార్పొరేట్లకు అప్పచెప్పడానికి కాశ్మీరు లాగానే వారికి కొన్ని అడ్డంకులు వస్తున్నాయని, వారి హక్కులను పూర్తిగా కాలరాయడానికి ఈ అల్లర్లను ప్రోత్సహిస్తున్నారని ఈ రాజకీయ అవకాశవాదాన్ని దేశ ప్రజలందరూ జాగ్రత్తగా గమనించాలని అన్నారు. ముఖ్యంగా మహిళల మీద దాడులు జరిగాయని, అదే సందర్భంలో కుకీలలో ఎక్కువమంది క్రిస్టియానిటీ మతంలో ఉన్న నేపథ్యంలో చర్చిల మీద కూడా దాడులకు తెగపడ్డారని అన్నారు. బిజెపి అవకాశవాద విధానాలను సరైన పద్ధతిలో ఎదుర్కోవాలని అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు చిల్కా ప్రభాకరరావు మాట్లాడుతూ దేశంలో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మతాలకు, కులాలకు అతీతంగా పెద్ద ఎత్తున ప్రజలు వ్యతిరేకించా లని అన్నారు. కార్యక్రమంలో పొన్నూరు ప్రజలు పాల్గొన్నారు

ప్రజాశక్తి - చేబ్రోలు :మణిపూర్ దాడులను నిరసిస్తూ ఆదివారం చేబ్రోలులో క్రైస్తవ సమాఖ్య, పాస్టర్స్ ఫెలోషిప్పులు, మరియు క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. మండలంలోని నారాకోడూరు ప్రధాన కేంద్రం నుండి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ సెంటర్ వరకు చేపట్టిన ర్యాలీలో భారీ సంఖ్యలో క్రైస్తవ సోదరులు, మద్దతు దార్లు పాల్గొన్నారు. మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవుల పై దాడులను ఆపాలని నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం కార్యక్రమంలో క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్షియల్ కార్పొరేషన్ డైరెక్టర్ మనోరంజని, పాస్టర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎ మార్క్, ఎఐసిసి కార్యదర్శి మల్లెలరాజు మాట్లాడారు. అన్ని మతాలను సమానంగా చూడాలని రాజ్యాంగం చెబుతుంటే క్రైస్తవులపై నిరంతరం దాడులు జరగడం విచారకరమన్నారు. ప్రధాన మంత్రి జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. ర్యాలీకి తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ సంఘీభావం తెలిపారు.

చేబ్రోలులో నిరసన

తాడేపల్లిలో మున్సిపల్ వర్కర్స్ నిరసన

రోగులను త్వరగా వార్డుకు పంపండి

జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి క్యాజువాల్టీ విభాగాన్ని ఆదివారం సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాజువాల్టి లోనే రోగులను ఉండటం పై ఆయన సిబ్బంది పై మండిపడ్డారు. పది గంటలకు వచ్చిన రోగి ని మధ్యాహ్నం వరకు వార్డు లోకి ఎందుకు పంపించ లేదని ఆయన ప్రశ్నించారు. చికిత్సలో జాప్యం జరిగితే రోగి ప్రాణాలుపోతాయని, ఆస్పత్రికి చెడ్డపేరు వస్తుందన్నారు. అనంతరం అదనపు ఒపి కౌంటర్ల నిర్మాణాలను పరిశీలించారు.

వాగు పూడికలు తీయించండి

ప్రజాశక్తి-దుగ్గిరాల

మండలంలోని చిలువూరు గ్రామంలో ఉన్న ఊదర వాగు పూడికను తీసి వాగు ప్రవాహానికి అడ్డంగా ఉన్న చెట్లను తొలగించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు అన్నారు. ఈ పరిసర ప్రాంతాలలో వాగు వలన 80 ఎకరాల్లో నీరు ఉందన్నారు. ఆదివారం గ్రామంలోని రైతులతో కలిసి ఆయన వాగును పరిశీలించారు. నీరు తొలగించకపోతే ఖరీఫ్‌లో రైతులు నష్టపోతారన్నారు. కౌలు రైతుసంఘం జిల్లాఅధ్యక్షుడు ఎం నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ వెద పద్ధతిలో విత్తనాలు వేసిన రైతులు నష్టపోయారని, రైతు భరోసా కేంద్రాల ద్వారా తక్కువ సమయంలో పంట చేతికి వచ్చే వంగడాలు సబ్సిడీపై అందించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు మాట్లాడుతూ ఈ సమస్యను పరిష్కరించకపోతే రైతులు నష్టపోవటమే గాక దోమలు ప్రబలే అవకాశం ఉందన్నారు. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్రె దావీదు, బండ్లమూడి కనకాంబరం, జి బాలచంద్రుడు, బి అమ్మిరెడ్డి, ఎం కోటేశ్వరావు, కె బాబు, ఎన్ శేష కుమార్, బుల్లబ్బాయి చిన్నబ్బాయి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో తాగునీటి కష్టాలు

నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఎస్సీ కాలనీ వాసులు

ప్రజాశక్తి-కారెంపూడి

మండలంలోని చింతపల్లి ఎస్సీ కాలనీ లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. గ్రామపంచాయతీ అధికారులు బోరు వేసి మోటర్ ద్వారా నీటిని కాలనీవాసులకు అందిస్తున్నారు. అయితే, తమకు నీటి సమస్య ఉన్న విషయాన్ని అధికారులకు చెప్పినా రెండు నెలలుగా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వేల్పుల చిననాగేశ్వరరావు, కోటేశ్వంరావు, బాబు,మోషే తిరుపతయ్య లు తెలిపారు. ప్రభుత్వం గ్రామపంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసి తాగునీటి అవసరాలకు ఉపయోగించాలని తెలిపినా, ఆ నిధులను పక్కదారి పట్టించారని ఆరోపించారు. బోరు మోటార్ తొలగించిన మరమ్మతులు చేయడంలో గ్రామపంచాయతీ అధికారులు విఫలమయ్యారని అన్నాఉ. ప్రభుత్వం ఇటీవల మండలానికి 40 చేతి పంపులను విడుదల చేసిందని, కనీసంఒక చేతిపంపును కూడా ఏర్పాటు చేయడం లేదని కాలనీవాసులు ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎస్సీ కాలనీవాసులు కోరుతున్నారు. ఈ విషయమై కార్యదర్శి రామరాజును వివరణ కోరగా గ్రామపంచాయతీలో నిధులు కొరత ఏర్పడిందని పది రోజుల్లో బోరుకు మోటార్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

రక్తదానం సామాజిక బాధ్యత

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రతి ఒక్కరూ రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాల్సిన అవసరం ఉందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఈన్నారు. దిల్‌సే ఫౌండేషన్ 5వ వార్షికోత్సవం సందర్భంగా చిలకలూరిపేట ఎస్ఎంఎస్ గార్డెన్స్‌లో ఆడివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసేం దుకు యువత ముందుకు రావాలని సూచించారు. దిల్‌సే ఫౌండే షన్ నిర్వాహకుల సేవా కార్యక్రమాలను అభినందించారు.

మట్టిఖర్చులకు రూ.5,000 అందజేత

ప్రజాశక్తి-బెల్లంకొండ

మండలంలోని వెంకటాయపాలెంలోని మాజీ ఎంపీటీసీ భుక్య రాములు నాయక్ గుంటూరులోని ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందారు.. ఈ విషయం తెలుసుకున్న పెదకూరపాడు మాజీ శాసన సభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్ ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ మంచి నాయకున్ని కోల్పోయిందని అన్నారు. పార్టీ తరపున మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 5000 వారి కుమారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ కోరు కమిటీ సభ్యులు వెన్న సీతారాంరెడ్డి, మండల టిడిపి మాజీ అధ్యక్షులు వర్ల వెంకటేశ్వర్లు, పాపాయపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు బొత్తుల వెంకట్రావు, గ్రామ పార్టీ అధ్యక్షులు మేళం శ్రీరామ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

టీచర్ పోస్టుల భర్తీ చేయండి

ప్రజాశక్తి-రెంటచింతల

మండలంలోని వివిధ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దళిత నేత రాగిడి ప్రతాప్ కోరారు. మెట్ట గుడిపాడు లోనే కేజీబీవీ, జెట్టిపాలెం మోడల్ స్కూల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు ఉపాధ్యాయులు లేకపోవడం వలన టెన్త్ ఇంటర్ చదివే విద్యార్థుల పరీక్ష ఫలితాలపై ప్రభావం పడుతుందని ఆయా పాఠశాలలో విద్యార్థులు చేరే సంఖ్యా కూడా తగ్గిపోతుందని తత్ఫలితంగా బీసీ ఎస్సీ ఎస్టీ విద్యార్థులు ప్రత్యామ్నాయ మార్గం చూసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు

విద్యార్థి ఫీజు చెల్లించిన ఎన్నారై

ప్రజాశక్తి-పెదకూరపాడు

గ్రామానికి చెందిన విద్యార్థి ఫారుక్ కు ఒక ప్రైవేటు పాఠశాలలో ఫీజు నిమిత్తం ఎన్నారై భానుప్రకాష్ తండ్రి కృష్ణారావు ఆదివారం చెల్లించారు. అతని చదువుకు సహకరిస్తామని భాను ప్రకాష్ చెప్పినట్లు మండల టిడిపి అధ్యక్షులు రమేష్ తెలిపారు.

విఆర్‌ఎల సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

విఆర్‌ఎల సమస్యలను పరిష్కరించే విషయంలో నిర్లక్ష్య వైఖరి తగదని, పభుత్వం వెంటనే స్పందించి వాటిని పరిష్కరించాలని పల్నాడు జిల్లా విఆర్‌ఎల అధ్యక్షులు షేక్ బందగి సాహెబ్ అన్నారు. స్థానిక పండరీపురంలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగిన విఆర్‌ఎల మూడు మండలాల స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బందగీ మాట్లాడుతూ విఆర్‌ఎల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబించకుండా తక్షణమే ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగానే విఆర్‌ఎలకు పేస్కేల్ అమలు చేయాలని, అర్హత ఉన్న విఆర్‌ఎలలకు వీఆర్వో గా ప్రమో షన్ ఇవ్వాలని, నామినీలుగా పని చేస్తున్న విఆర్‌ఎలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 7, 8వ తేదీల్లో కలెక్టర్ కార్యాలయం వద్ద రెండు రోజులు దీక్షలను జయప్రదం చేయాలని కోరారు. విఆర్‌ఎల సమస్యలను పరిష్కారం చేయకుంటే ఆగస్టు 25న విజయవాడ అలంకార్ సెంటర్‌లో రాష్ట్రంలో ఉన్న వేలాది మంది విఆర్‌ఎలతో ఛలో విజయవాడ నిర్వహిస్తాని అన్నారు. అనంతరం సిఐటియు మండల కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విఆర్‌ఎల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకూ వారికి సిఐటియు పూర్తి మద్దతుతో పాటు సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు. అనంతరం యడ్ల పాడు,చిలకలూరి పేట, నాదెండ్ల మండలాల డివిజ న్ కమిటీని ఎన్నుకున్నారు. నియోజక వర్గ డివిజన్ అధ్యక్షు లుగా రాజేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శిగా ఆనం ద్ ఏకీగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి చిలకలూరిపేట మండల అధ్యక్షులు ఆనంద్, రాజేష్ లు అధ్యక్షత వహించారు.

సమావేశంలో మాట్లాడుతున్న షేక్ బందగి సాహెబ్

మానవ అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

మాట్లాడుతున్న విజయ్ కుమార్

మానవ అక్రమ రవాణాపై కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు కటినంగా వ్యవహరించాలని జై భీం భారత్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు , న్యాయవాది జె.విజయ్ కుమార్ ఆదివారం ఒక ప్రక టనలో తెలిపారు . అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో ఓ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మానవ అక్రమ రవాణాకు ప్రధానకారణం స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ళు గడుస్తున్నప్పటికి నేటికీ దేశంలో నిరుద్యోగం యువతకు శాపంగా మారిందని, దీంతో బ్రతుకు దెరువుకోసం వలసలు మొదలయ్యాయని ఈ నేపథ్యంలోనే మానవ అక్రమ రవాణా కేసులు పెరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. మహిళల రక్షణకు ఎన్నో చట్టాలు వున్నాయని ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానవ అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కటిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు .

'యువగళం'లో పాల్గొన్న అరవిందబాబు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

లోకేష్‌తో అరవిందబాబు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఆదివారం బాపట్ల జిల్లా అద్దంకి చేరుకుంది. టిడిపి నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అద్దంకిలో నారా లోకేష్ ను కలిసి సంఘీభావం తెలిపారు. నరసరావుపేట రాజ కీయ పరిస్థితులను లోకేష్ కు వివరించారు.

లోకేష్ ఛాలెంజ్‌కు వైసిపి అక్రమార్కులు సిద్ధమేనా?

టిడిపి ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు

ప్రజాశక్తి-వినుకొండ

నాలుగున్నరేళ్ల వైసిపి పాలనలో అవినీతి సామ్రాజ్యాలుగా ఏర్పడ్డ పల్నాడు జిల్లా లోని ఐదు నియోజకవర్గాల్లో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర జరగనుందని మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు.ప్రకాశం జిల్లా నుండి ఆగస్టు 1న వినుకొండ నియోజకవర్గం నూజెండ్ల మండలం ముప్పరాజు వారి పాలెం వద్ద ప్రారంభమయ్యే యువ గళం పాదయాత్ర ఏర్పాట్లను పుల్లారావుతో పాటు మాజీ మం త్రులు నక్క ఆనంద్ బాబు, ఆలపాటి రాజా, పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ ఆయా నియోజకవర్గాల్లో జరిగిన అవినీతి అక్రమాలపై లోకేష్ చాలెంజ్ చేయనున్నారని, ఈ చాలెంజ్ కి వైసిపి అక్రమార్కులు రావాలని సవాల్ చేశారు. డిపార్టుమెంట్ల వారీగా ఇప్పటివరకు జరిగిన అవినీతి అక్రమాలు, దోపిడీలపై లోకేష్ చాలెంజ్ విసరనున్నట్లు చెప్పారు. జీవీ ఆంజనేయులు పై అక్రమ కేసులు పెట్టించిన వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడుకి బుద్ధి చెప్పడం ఖాయమని, టిడిపి నేతలు ఎవరిపైన కేసులు పెట్టినా తాము బెయిల్ కు వెళ్లే పరిస్థితి లేదని, పల్నాడు జిల్లాలో ఏడు నియోజకవర్గాల టిడిపి నేతలపై కూడా దమ్ముంటే కేసులు పెట్టాలని అన్నారు. జీవి ఆంజనేయులు నాయకత్వంలో పల్నాడు జిల్లాలో లోకేష్ పాదయాత్ర ఒక చరిత్ర సృష్టించబోతోందని అన్నారు. మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ యువగళం-ప్రజాగళంగా మారి యువ తరానికి ఆదర్శంగా నిలుస్తూ పాదయాత్రలో రాష్ట్ర ప్రజల ఉజ్వల భవిష్యత్తు కనిపించే విధంగా జరుగుతుందన్నారు. ఆలపాటి రాజా మాట్లాడుతూ రాష్ట్రానికి రాజధాని లేకుండా మూలాలను నాశనం చేసిన జగన్ రెడ్డి పాలనను అంతమొందించే శక్తిగా యువగళం యాత్రను ప్రజలు హర్షిస్తున్నట్లు చెప్పారు. జివి ఆంజనేయులు మాట్లాడుతూ వైసిపి గుర్తించిన 32 స్థానాల్లో రెండు స్థానాలు కూడా వైసిపి గెలిచే పరిస్థితి లేదని ప్రశాంత్ కిషోర్ ఇచ్చిన నివేదికతో వైసిపి నేతల గుం డెల్లో వణుకు పుడుతుందోని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొమ్మాలపాటి శ్రీధర్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు, ఉగ్రనరసింహరెడ్డి పాల్గొన్నారు

ముప్పరాజువారి పాలెం వద్ద ప్రారంభం కానున్న యువ గళం పాదయాత్ర ఏర్పాట్లను పరిశీలిస్తున్న పుల్లారావు, ఆలపాటి రాజా, ఆనంద్‌బాబు,జివి ఆంజనేయులు

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-పెదకూరపాడు

తెలుగుదేశం పార్టీతోనే మహిళలకు రక్షణ ఉంటుందని పల్నాడు జిల్లా టిడిపి జిల్లా మహిళ కార్యదర్శి షేక్ ముం తాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని తమ్మవరం గ్రామంలో తెలుగు మహిళా నేతలు మహిళా పథకాలపై ఇం టింటి ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో పేద మహిళలకు రక్షణ కరువైందని అన్నారు.

'మహాశక్తి'తో మహిళలకు ప్రయోజనం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీమ్యానిఫెస్టోలోని మహాశక్తి పథకంతో మహిళలకు ప్రయోజనం చేకూరుతుందని తెలుగు మహిళా పార్లమెంటు ఉపాధ్యక్షురాలు సంధ్య అన్నారు. సత్తెనపల్లి మండలం భట్లూరులో మహాశక్తి ప్రచార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ ఈ పథకం గురించి మహిళలకు వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షురాలు జి.సుశీల, సంగం డెయిరీ డైరెక్టర్ పి.శేగిరికుమారి, మండల అధ్యక్షురాలు మల్లీశ్వరి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆర్.ప్రసాద్ పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య డంపింగ్ యార్డును తీసేయండి

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి టిడ్కో గృహ సముదాయంలో ఇళ్ల మధ్య దుర్గంధాన్ని వెదజల్లుతున్న డంపింగ్ యార్డును వెంటనే నిలుపుదల చేయాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. దగ్గర్లోని జనావాసాలను, నిత్యం ప్రయాణించే ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న ఈ డంపింగ్ యార్డును తరలించడంలో అధికారులు, స్థానిక ఎమ్మెల్యే తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. డంపింగ్ యార్డు వద్ద మంగళగిరి టిడిపి పట్టణ అధ్యక్షులు డి.రాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, టిడ్కో గృహ నివాసితులతో కలిసి ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలు మార్లు కార్పొరేషన్ అధికారులకు, ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని నివాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు వల్ల దోమలు, దుర్వాసన వంటి పలు సమస్యలను ఎదుర్కొంటున్నామని, అప్పుడప్పుడు చెత్తను కాల్చడంతో ఎగసి పడుతున్న మంటలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లు స్థానికులు తమ గోడును నాయకులకు విన్నవించారు. నగరంలోని చెత్తనంతా ఈ డంపింగ్ యార్డులో డంప్ చేస్తున్నారని చెప్పారు. దాదాపు 1728 కుటుంబాలు ఈ దుర్వాసన భరించాల్సి వస్తోందని అన్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని , వర్షాకాలం కావడంతో డంపింగ్ యార్డు చుట్టుపక్కల ఉన్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా వచ్చే ఆదివారం లోపు డంపింగ్ యార్డును తొలగించాలని, లేనిపక్షంలో ఇక్కడున్న చెత్తను తీసుకు వెళ్లి కార్పొరేషన్ కార్యాలయం ముందు వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు జి. దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి అబ్దుల్ మజీద్, రాష్ట్ర పద్మశాలి సాధికారిక సమితి సభ్యులు యు.శ్రీమన్నారాయణ, పట్టణ కమిటీ

టిడ్కో గృహాల వద్ద డంపింగ్ యార్డు వద్ద టిడిపి నాయకులు

కార్యదర్శులు బి.శ్రీనివాసరావు, ఎన్.రాజశేఖర్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వి.మాధవరావు, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ సుభాని, నియోజకవర్గ టిఎన్‌టియుసి పధాన కార్యదర్శి జి.రాఘవ, నియోజకవర్గ బిసి సెల్ మీడియా కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, సిహెచ్ పూర్ణ, ఎ.సుబ్బారావు, బి.నవీన్, పి.నాగశ్రీకన్య, తెలుగు విద్యార్థి నాయకులు డి.నందు, బి.నాని, డి.రాజారావు, పి.శివరామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

పెదరావూరులో అనాథ వృద్ధాశ్రమం ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలి

వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ కృష్ణ సందీప్

రూరల్ గ్రామం పెదరావూరులో ఎల్ సి సింహం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అనాథ వృద్ధాశ్రమాన్ని మైత్రి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ ఆలపాటి కృష్ణ సందీప్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వద్దులు నిరాశ్రయుల కోసం దీనిని ఏర్పాటు చేయడం అభినందనీయమని, వైద్య పరంగా ఆశ్రమంలో తలదాచుకుంటున్న వారికి తన వంతు సాయం చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఏడుంబాక వెంకటస్వామి యాదవ్, ఎస్సీ, ఎస్టీ, బిసి ఐక్యవేదిక అధ్యక్షులు ఎం.కిరణ్ కుమార్, కె. మురళీకష్ణ, వి వివేకానంద్, వి శ్రీనివాసరావు, జగన్, మోజెస్ పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని కొత్తపేటకు చెందిన పేద వృద్ధురాలు షేక్ నబీబికి ఆర్థిక సహాయం అందజేశారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రూ. 10,000 వైసిపి నాయకుల చేత ఆదివారం ఆమెకు అందజేయించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎం.మల్లేశ్వరరావు, ఎండి ఫిరోజ్, ఎం సుధారాణి, ఎస్.సునీత తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శర్మకు నివాళి

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి ప్రాంతంలో అందరికీ అందుబాటులో వైద్యం అందించి ప్రజల డాక్టర్‌గా డాక్టర్ డిఎస్ఎన్ శర్మ మన్ననలు పొందారని పలువురు వక్తలు కొనియాడారు. డాక్టర్ శర్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా స్థానిక గౌడ కల్యాణ మండపంలో ఆయన సంతాప సభ ఆదివారం నిర్వహించారు. మారుతి ఫౌండేషన్ జంగాల సాంబశివరావు ఎంబిబిఎస్ సెకండియర్ చదువుతున్న పేద విద్యార్థులకు ఉచితంగా రూ.50 వేలు విలువ గల పుస్తకాలు పంపిణీ చేశారు. వైద్య వృత్తిలో ఎంతో పేరు సంపాదించి ప్రజల మనిషి అనిపించుకున్న డాక్టర్ శర్మకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ప్రసాద్ మాస్టార్ అధ్యక్షత వహించగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు జంగాల సాంబశివరావు, డి.వేమారెడ్డి, డి.వెంకటరెడ్డి, కె.బాపిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.మహాలక్ష్మి, కె.కాశయ్య, బూరుగ వెంకటేశ్వర్లు, ఎస్.నాగేశ్వరరావు, డాక్టర్ మోహన్, డాక్టర్ పలగాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శాంతించిన కృష్ణమ్మ

ప్రజాశక్తి-తాడేపల్లి

గత నాలుగు రోజులుగా ప్రకాశం బ్యారేజీ వద్ద పరవళ్లు తొక్కిన కృష్ణానది ఆదివారానికి శాంతించింది. దీంతో బ్యారేజీకి ఉన్న 65 గేట్లు అడుగు మేర ఎత్తి 47,580 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. ఐదు గేట్లు మూసివేశారు.

మంచి జీవనశైలితో ఎముకల వ్యాధుల నియంత్రణ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ఆదివారం ఎముకల సంబంధిత వ్యాధుల గురించి ఆరోగ్య సభ నిర్వహించారు. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కంచర్ల రాంప్రసాద్ మాట్లాడుతూ పెద్దల్లో వచ్చే ఎముకల సంబంధిత వ్యాధులను రెండు రకాలుగా విభజిస్తారని ఒకటి ఎముకలలో అరుగుదల, మరొకటి ఎముకలు మెత్తబడటం అని చెప్పారు. అరుగుదల జన్యుపరంగా, దొడ్డికాళ్ల వల్ల వస్తుందని, జీవన శైలి వల్ల వస్తుందన్నారు. జీవనశైలి కారణంగా వచ్చే ఎముకల్లో అరుగుదలను మనం మంచి ఆహారం తీసుకుంటూ బరువును అదుపులో ఉంచుకొని, వ్యాయామం చేస్తూ నియంత్రణ చేయవచ్చన్నారు. ఇక ఎముకలు మెత్తబడటం అనేది 'డి' విటమిన్ లోపం వల్ల వస్తుందన్నారు. స్త్రీలకు, ముఖ్యంగా నెలసరి ఆగిన స్త్రీలకు ఈ సమస్య ఎక్కువగా వస్తుందన్నారు. నడక, ఎండలో ఉండటం, విటమిన్ 'డి'తో కూడిన క్యాల్షియం

తీసుకుంటే ఈ సమస్యను నియంత్రించవచ్చన్నారు. మోకాళ్లలో గుజ్జు పట్టడానికి వాడే మందులు తొలి దశలో ఉన్నపుడు ఉపయోగం అని, బాగా ముదిరిన సందర్భంలో అవి అంతగా ఉపయోగపడవని చెప్పారు. మోకాళ్ల నొప్పులకు కొన్ని సందర్భాల్లో ఇంజెక్షన్ల ద్వారా కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉందన్నారు. మోకాళ్ల ఆపరేషన్‌లు ఇక చివరి ప్రయత్నమని చెప్పారు. వ్యాయామం, ఆహారఅలవాట్ల ద్వారా ఎముకలు అరుగటం, మెత్త బడుటం నియంత్రణ చేసుకోవడం ఉత్తమమైన పద్ధతి అని, అవసరమైన మేరకు మాత్రమే మందులపై ఆధారపడాలన్నారు. అనంతరం సభ్యులు అడిగిన సందేహాలను నివృతి చేశారు.

సీనియర్ సిటిజన్స్ కు దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి-తెనాలి

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జూలై నెల సమావేశంలో భాగంగా ఆదివారం స్థానిక కవిరాజ పార్కులోని విజికే భవన్లో సీనియర్ సిటిజన్లకు దంత వైద్య శిబిరం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు ఎం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రవీంద్రనాథ్, డాక్టర్ జె స్వప్న, డాక్టర్ చందు శివ అసోసియేషన్ సభ్యులకు ఉచితంగా దంత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ వద్ధాప్యంలో వచ్చే దంత సమస్యల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆహారం త్వరితగతిన జీర్ణం కావాలంటే సాధ్యమైనంత మెత్తగా నమిలి

మింగాలని, మితాహారం తీసుకోవాలని, రెండు పూటలా దంతాలు శుభ్రం చేసుకోవాలని చెప్పారు. వైద్య సేవలు అందించిన వైద్య బందాన్ని అసోసియేషన్ సత్కరించింది .కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు కోశాధికారి ఎస్ నాగేంద్రయ్య సభ్యులు పాల్గొన్నారు. తొలుత ఇటీవల మతి చెందిన అసోసియేషన్ సభ్యులు పిరాట్ల నారాయణమూర్తికి సభ్యులు నివాళులర్పించారు.

విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సంస్థ చేయూత

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన మానవత స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు చేయూతనిచ్చారు. స్థానిక శారద హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి సంస్థ చైర్మన్ డాక్టర్ కె.రామ్ చంద్ అధ్యక్షత వహించారు. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా స్వదేశానికి వెనుదిరిగి, తిరిగి చదువును కొనసాగించేందుకు వెళుతున్న ఇరువురు విద్యార్థులు ఎన్ నరేష్, ఎన్.మౌనిక కు రూ.30 వేల ఆర్థిక

సాయం అందించారు. ఈ సందర్భంగా రామ్ చంద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తమ సంస్థకు 98 శాఖలు ఉన్నాయని, విద్యా వైద్య రంగంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కోచైర్మన్ డాక్టర్ డి శారద మాట్లాడుతూ సాయం పొందిన వారు ఉన్నత శిఖరాలను అందుకుని, మరొకరికి సాయపడే రీతిలో ఉండాలని ఆకాంక్షించారు.

అంగలకుదురులో న్యాయవిజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-తెనాలి

అంగలకుదురులో మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో సీనియర్ న్యాయవాది ఎన్.వి మహేశ్వరరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అమానవీయమన్నారు. బెదిరింపు, బలవంతంగా లొంగదీసుకోవడం, మానవ శరీర అవయవాలు విక్రయం వంటివి మానవ అక్రమ రవాణా కిందికి వస్తాయని వివరించారు. భారతీయ శిక్షాస్మృతిలో సెక్షన్ 370 ప్రకారం మానవ అక్రమ రవాణాకు పాల్పడిన వారికి ఏడేళ్ళకు తక్కువ కాకుండా జైలు శిక్ష ఉంటుందని అన్నారు. యర్రంశెట్టి అనిల్‌కుమార్ మాట్లాడుతూ చట్టాలు, ఉచిత న్యాయసేవలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అంజుమన్ సంస్థ అధ్యక్షులుగా అక్రమ్

ప్రజాశక్తి-మంగళగిరి

ఈ నెల 23న మంగళగిరి అంజుమన్ సంస్థకు ఎన్నికల జరిగాయి. ఈ ఎన్నికల్లో ఇస్లామిక్ ఫ్రంట్ ఘన విజయం సాధించింది. ఈ సందర్భంగా ఆదివారం అంజుమన్ కార్యా లయ ఆవరణలో ఎన్నికల అధికారి షేక్ అస్గర్ అలీ సమక్షంలో జామియా మసీద్ ఫేష్ఇం షేక్ అన్వరీ ఎన్నికైన సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అంజుమన్ సంస్థ అధ్యక్షులుగా షేక్ అక్రమ్, కార్యదర్శి గా షేక్ హనిష ఖాదరి ఎన్నికయ్యారు. ఇస్లామిక్ ఫ్రంట్ సభ్యులుగా ఎన్నికైన ఏడుగురి చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

ఇస్లామిక్ ఫ్రంట్ అధ్యక్షుడిగా షేక్ రియాజ్

ఇస్లామిక్ ఫ్రంట్ అధ్యక్షులుగా షేక్ రియాజ్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇస్లామిక్ ఫ్రంట్ అధ్యక్షులుగా ఉన్న షేక్ అక్రమ్ అంజుమన్ సంస్థ అధ్యక్షు లుగా ఎన్నికయ్యారు.

పౌష్టికాహారం పంపిణీలో చైర్‌పర్సన్, క్లబ్ బృందం

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణి

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. స్థానిక లక్ష్మీ ప్రియ జ్యూయలర్స్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నశీం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ గృహిణి ఆరోగ్యంగా ఉంటే కుటుంబం, సమాజం కూడా అంతే ఆరోగ్యంగా ఉంటా యన్నారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించాలన్న రోటరీ క్లబ్ సంకల్పం గొప్పదని ప్రశంసించారు. అనంతరం క్లబ్ అద్యక్షులు పి.రాంబాబు, రోటరి అసిస్టెంట్ గవర్నర్ కె. మురళీకృష్ణ మాట్లాడారు. భవిష్యత్‌లో క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తరింపచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎం.హరిప్రసాద్, కౌన్సిలర్ సాయిహరేరామ్, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ బిబిజాన్, లక్ష్మీప్రియ జ్యూయలర్స్ అధినేత టి.భాస్కరరావు, జి.నారాయణ పాల్గొన్నారు.

వేతనాలు తగ్గించాలని ప్రయత్నం

సిహెచ్.నాగబ్రహ్మచారి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు

ఏడాదికిపైగా వేతన సవరణ కోసం ఎదరు చూస్తున్న ఉద్యోగులకు వేతనాలు తగ్గించాలని యాజమాన్యం ప్రయత్నం చేస్తుంది. అందుకు ఒప్పుకుంటేనే చర్చలకు పిలుస్తామనే సంకేతాలు ఇవ్వటం విడ్డూరంగా ఉంది. విద్యుత్ ఉద్యోగులకు జీతాలు ఎక్కువని తప్పుడు ప్రచారం చేస్తుంది. 50శాతంపైగా ఉద్యోగులు కేవలం రూ.15వేల జీతంతో ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్నారు. గత 15 నెలలుగా పవర్ జెఏసి ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై రాజీధోరణితో వ్యవహరించిన కారణంగానే తాము బయటకు వచ్చి స్ట్రగుల్ కమిటీ ఏర్పాటు చేసుకున్నాము. సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలి.

45 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలి

డి.వెంకటేశ్వరరావు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు

గత 15 నెలలుగా వేతన సవరణంపై యాజమాన్యం, ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంది. వందమందికిపైగా జెఎల్ఎంలు విధి నిర్వహణలో చని పోయారు. యాజమాన్యం పట్టించుకో లేదు. వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కాంట్రాక్ట్ ఉద్యోగులకు వేతనాలు పెంచలేదు. విద్యుత్ ఉద్యోగులకు 45 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేయాలి, కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని రెగ్యులర్ చేయాలి.

23సార్లు కలిసినా ఫలితం లేదు

ఎస్.గురుబ్రహ్మం, ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి

సమస్యలపై అధికారులను 23 సార్లు కలిసి చర్చించినా ఎలాంటి ఫలితం లేదు. కింది స్థాయి నుండి ఉన్నతాధి కారుల వరకూ అనేక రూపాల్లో ఆందోళనలు చేసినా పట్టించుకోలేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచమంటే సింగిల్ మాస్టర్ స్కేల్ పేరుతో వేతనాలు కుదించాలని ప్రయత్నాలు చేయటం తీవ్ర అన్యాయం. దీన్ని సహించబోము. చనిపోయిన గ్రేడ్-2 జెఎల్ఎంల కుటుంబాలకు న్యాయం చేయాలి.

వేతనాలు పెంచాలి

ఎల్.అరుణ, ఐద్వా జిల్లా కార్యదర్శి

పెరిగిన ధరలకు అనుగుణంగా ఉద్యోగులు, కార్మికులకు వేతనాలు పెంచాలి. ఇటీవల అంగన్‌వాడీలు, ఆశాలు వేతనాల పెంపు, ఇతర డిమాండ్ల సాధనకు రోడ్డె క్కారు. అన్ని రంగాల్లో కార్మికులు హక్కుల కోసం రోడ్డెక్కుతు న్నారు. వేతనాలు పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

స్పందించకుంటే సమ్మె తప్పదు

- విద్యుత్ ఉద్యోగులు, కార్మికులకు ఓపిక నశించింది

- స్ట్రగుల్ కమిటీ రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు

మాట్లాడుతున్న నాగబ్రహ్మచారి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 10వ తేదీ నుండి సమ్మె తప్పదని స్ట్రగుల్ కమిటీ హెచ్చరించింది. విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్.నాగబ్రహ్మచారి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.స్ట్రగుల్ కమిటీలోని సంఘాలు సహా, సిఐటియు, ఎఐటియుసి, వివిధ ప్రజాసంఘాల నాయకులు సమావేశంలో పాల్గొని ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. 31వ తేదీన కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని, ఆగస్టు 2న ఎస్ఈ కార్యాలయాల వద్ద ర్యాలీలు నిర్వహించాలని, ఈలోగా ప్రభుత్వం స్పందించకపోతే 10వ తేదీ తర్వాత ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్లాలని స్ట్రగుల్ కమిటీ నిర్ణయించినట్లు నాయకులు తెలిపారు. ఆగస్టు 17న ఛలో విద్యుత్ సౌధ నిర్వహిస్తామన్నారు. సమ్మె నివారణకు యాజమాన్యం, ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉందని నాయకులు హెచ్చరించారు.సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్, హనుమంతరావు, ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీకాంత్, జెవివి నాయకులు వెంకట్రావు, అవాజ్ నాయకులు భాషా, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కృష్ణకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యం.కిరణ్‌కుమార్, బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు కిషోర్, ఎపిఎంఎస్ఆర్‌యు నాయకులు సలీం తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి

బి.ముత్యాలరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి

తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని క్రమబద్ధీక రిస్తామని ఎన్నికల్లో, అసెంబ్లీలోనూ జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంత్రుల కమిటీ, వారికి సలహాలు ఇవ్వటానికి అధికారుల కమిటీ ఏర్పాటు చేసి, నాలుగేళ్లుగా కాలయాపన చేశారు. ఇటీవల 10,117 మందిని క్రమబద్ధీకరిస్తామని చెప్పి, తీరా కటాఫ్ తేదీ విధించి, వాటిల్లోనూ కత్తిరింపులు చేపట్టారు. దీంతో 6వేల మందికి మించి క్రమబద్ధీకణ అయ్యే అవకాశం కల్పించట్లేదు. మళ్లీ ఎన్నికలు వస్తున్నందున ప్రచారం చేసుకోవడానికి తూతూ మంత్రంగా క్రమబద్ధీకరణ చేపట్టారు.

కాంట్రాక్ట్ కార్మికుల్ని క్రమబద్ధీకరించాలి

నాగరాజు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి

విద్యుత్ ఉద్యోగులకు 45 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల్ని పర్మినెంట్ చేయాలని, జెఎల్ఎం గ్రేడ్- 2 ఎనర్జీ అసిస్టెంట్లకు వేతన సవరణ చేయా లని, వారి కుటుంబానికి వైద్య సదుపాయం కల్పించాలని, చనిపోయిన వారి కుటుంబాల్లో కారుణ్య నియామాలు చేపట్టాలని, పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని తదితర డిమాండ్లతో కూడిన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

ఎక్కువ వేతనాలు అని దుష్ప్రచారం

వి.రాధాకృష్ణమూర్తి, ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు

తెలంగాణ కంటే ఏపీలో విద్యుత్ ఉద్యోగులు 30 శాతం తక్కువ వేతనాలు పొందుతున్నారు. తెలంగా ణలో కాంట్రాక్ట్ స్కిల్ కార్మికులు నెలకు రూ.43,162లు పొందు తుంటే ఇక్కడ మాత్రం కేవలం రూ.20,598లు ఇస్తున్నారు. ఈ విషయా లు పట్టించుకోకుండా విద్యుత్ ఉద్యోగులకు ఎక్కువ వేతనాలు ఉన్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు వారి న్యాయమైన డిమాండ్ల సాధనకు చేపట్టిన ఉద్యమాన్ని పట్టుదలతో కొనసాగించాలి. సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ అండగా ఉంటాము.

ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొట్టాలి

వివికె.సురేష్, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీ కరణ విధానాలు అవలంబిస్తూ అడ్డ గోలుగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నాయి. ఆ విధానాలను రాష్ట్ర ప్రభుత్వం గుడ్డిగా అనుసరిస్తుంది. ప్రజాస్వామ్య విధానంలో ఉద్యోగ సంఘాలతో కనీసం చర్చించట్లేదు. అన్ని సమస్యలకూ రాజకీయ నాయకులు చేస్తున్న విధానాలే కారణం. వీటికి వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలి.

పాలకుల హామీలు కాగితాలకే పరిమితం

రవి, ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కన్వీనర్

ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా కాంట్రాక్ట్ కార్మికుల బ్రతుకుల్లో మార్పు రావట్లేదు. కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని రెగ్యులర్ చేస్తామని గత, ప్రస్తుతం ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితం అయ్యాయి. మేము కనీస వేతనాలు కూడా పొందట్లేదు. కుటుంబానికి మూడు పూటలా అన్నం కూడా పెట్టలేని దయనీయ స్థితిలో ఉన్నాము. సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ స్ట్రగుల్ కమిటీ ఐక్యంగా పని చేస్తుంది.

ఉద్యోగులపై వేధింపులు పెరిగాయి

బి.లక్ష్మణరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి

యాజమాన్యాన్ని 23 సార్లు కలిసి సమస్యలు విన్నవించినా పట్టించుకోని పక్షంలోనే, ఓపిక నశించి ఉద్యోగులు స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమానికి సిద్ధం అయ్యారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కాంట్రాక్ట్ కార్మికులపై వేధింపులు పెరిగాయి. టార్గెట్లు పూర్తి చేయకపోతే వేతనాలు నుండి మినహాయిస్తామని బెదిరింపులకు దిగుతున్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం ఉధృతం అవుతుంది.

పిఎఎస్ కళాశాల

ప్రిన్సిపల్‌కు పిహెచ్‌డి

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

స్థానిక పిఎఎస్ కళాశాల ప్రిన్సిపల్ గుర్రం వీర రాఘ వయ్య కర్నూలు లోని రాయలసీమ విశ్వ విద్యాలయం నుండి 'కంప్యూటర్ సైన్సులో' డాక్టరేటు పట్టాను సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం కళాశాలలో పాలకవర్గం లావు ఆదిశేషయ్య, తదితరులు ప్రిన్సిపల్‌కు అభినందనలు తెలిపి, ఘనంగా సత్కరించారు. అనంతరం వీర రాఘవయ్య మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ఆచార్యులు డాక్టర్ రామినేని శివరామ ప్రసాద్ పర్యవేక్షణలో "క్వాంటమ్ కీ డిస్ట్రిబ్యూషన్' వెరిఫైబుల్, మరియు ట్రేసబుల్ సైఫర్ టెక్స్ట్ పాలసీ ఏట్రిబ్యూట్ బేస్డ్ ఎన్క్రిప్షన్, సెక్యూరిటీ మోడల్ ఫర్ ట్రెజరి ఇన్ఫర్మేషన్ సిస్టం' అంశము మీద పరిశోధనా గ్రంధాన్ని సమర్పించి నందుకు పిహెచ్‌డి పట్టాను పొంది నట్లు తెలిపారు రీసెర్చ్ వర్క్‌లో భాగంగా జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురిం చిన పరిశోధన పత్రాలు ప్రామాణికమైనవిగా గుర్తింపు పొందాయని తెలిపారు.

సెల్‌ఫోన్ డ్రైవింగ్ క్షేమకరం కాదు

జరిమానా రూ.20 వేలకు పెంపు అవాస్తవం

టూ వీలర్‌కు రూ.వెయ్యి, నాలుగు చక్రాల వాహనానికి రూ.2వేలు

విద్యా సంస్థల బస్సులపై 110 కేసులునమోదు

ప్రజాశక్తి ప్రతినిధితో జిల్లా రవాణా అధికారి కరీం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వాహనదారులు సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం సరికాదని జిల్లా రవాణా అధికారి షేక్ కరీంతెలిపారు. ఇలా డ్రైవ్ చేయడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆయన చెప్పారు. హెడ్‌ఫోన్, హియర్ ఫోన్ ద్వారా మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే రూ.20వేలు జరిమానా విధిస్తున్నట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఇది పుకారు మాత్రమేనని ప్రభుత్వం ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. ఇప్పటి వరకు ఉన్న ఆదేశాల మేరకు సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే టూ వీలర్‌కు రూ.వెయ్యి, నాలుగు చక్రాల వాహనానికి రూ.2వేలు మాత్రమేజరిమానా విధించాలని ఉత్తర్వులు ఉన్నాయన్నారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

పాఠశాల బస్సుల తనిఖీ పూర్తయిందా?

జిల్లాలోని విద్యా సంస్థలకు చెందిన బస్సులన్నింటిని తనిఖీ చేశారు. ప్రతి బస్సు సామర్థ్యం(ఫిట్‌నెస్) ధృవీకరణ పత్రం తీసుకున్నారు. జిల్లాలో 1600బస్సులు ఉండగా నిబంధనలుపాటించని 103 బస్సులపై 110 కేసులు నమోదు చేశాం. విద్యార్థుల భద్రత దృష్ట్యా ప్రతి బస్సులో విద్యార్థులను దించడానికి, ఎక్కించడానికి అటెండరు తప్పకుండా ఉండాలి. అలాగే బస్సు డ్రైవర్లకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలను చేయించాలి. ఈజాగ్రత్తలు యాజమాన్యాలు ఎప్పటికప్పుడు పరిశీలించాలి.

వాహనాల పన్ను వసూలు ఎలా ఉంది?

త్రైమాసికపన్ను వసూలుకు ఈనెల 31 చివరి తేదీ. పన్నులను గతంలో కన్నా 25 శాతం ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ప్రభుత్వం పెంచింది.ఈ మేరకు చెల్లింపులు జరుగుతున్నాయి. విద్యాసంస్థల బస్సులో గతంలో బస్సుబరువును బట్టి పన్ను ఉండేది.ఇప్పుడు సీటును బట్టి వసూలు చేస్తున్నాం. సీటుకు 100 చెల్లించాలి.40 సీట్ల సామర్థ్యం ఉంటే రూ.4వేలు చెల్లించాలి. జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరంలోరూ.403కోట్లు వసూలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఈమేరకు కృషి చేస్తున్నారు. 2022-23లో రూ.360కోట్ల లక్ష్యంగా నిర్ణయించగా రూ.269 కోట్ల మేరకు వసూలు చేశాం.

నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై తనిఖీలు?

నిబంధనల అమలుపై వాహనదారులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. ట్రాక్టర్లలో వ్యవసాయ ఉత్పత్తులు మాత్రమే తీసుకువెళ్లాలి. కానీ పలు సందర్భాలల్లో ప్రయాణికులను చేరవేస్తున్నారు. ప్రమాదాలుకూడా జరుగుతున్నాయి. అలాగే కార్లు నడిపే వారు సీటు బెల్టు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, వాహనాల్లో పరిమితికి మించి అధికంగా ప్రయాణికులను ఎక్కించడం, అతివేగం తదితర కారణాలపై ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిపై తాము తనిఖీ చేసి జరిమానాలు విధిస్తున్నాం. లైసెన్సు, వాహనాలకు ఫిట్ నెస్ సర్టిఫికెట్ లేకున్నా జరిమానాలు విధిస్తాం. ప్రధానంగా నిబంధనలు పాటించని వాహనాలపైనే దృష్టిసారిస్తున్నాం.

రహదారి భద్రతకు తీసుకుంటున్న చర్యలు?

జిల్లాలో వివిధ శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నాం. నిబంధనలుపాటించకపోవడం వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇందుకోసం వాహనదారులకు ఎప్పటికప్పుడు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. కళాశాలలు, కూడలి ప్రదేశాల్లో ర్యాలీలు, సదస్సులుపెట్టి అవగాహన కల్పిస్తున్నాం.